http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

శుక్రవారం 22 మే 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-


Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828




# వామ్మో.. 48 డిగ్రీలు!

- తెలుగు రాష్ట్రాల్లో ఎండలు భగ్గుమంటున్నాయి.
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రికార్డు స్థాయిలో 48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి
- పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 48.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది
- వచ్చే వారం రోజుల పాటు ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం
- ప్రజలు అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్నం బయటకు రావొద్దని సూచన

తెలుగు రాష్ట్రాల్లో రోళ్లు పగిలే ఎండలు..

రికార్డులు బద్దలు కొడుతున్న ఉష్ణోగ్రతలు..

హైయెస్ట్ రిపోర్ట్ చూస్తే మంటలే..



సమ్మర్ హీట్ నెక్స్ట్ లెవెల్‌కి చేరింది. బయటకొచ్చారా.. మాడు పగిలిపోద్ది అంటూ డేంజర్ బెల్స్ మోగిస్తున్నాడు సూర్యుడు. ఎండల ధాటికి తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నిప్పుల కొలిమిలా మారిపోతున్నాయి. చాలా ప్రాంతాల్లో రోళ్లు, రాళ్లు పగిలే ఎండలు ప్రజలను బెంబేలెత్తిస్తోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు నరకం చూస్తున్నారు.



పంట కొనుగోళ్ల సంక్షోభంపై

# ఎన్నాళ్లీ మొద్దు నిద్ర

- సీఎం రేవంత్ రెడ్డిని నిలదీస్తూ కేటీఆర్ లేఖ
- ధాన్యం తగలబెట్టుకుంటున్నా తండ్లాట తీర్చరా
- రాష్ట్రంలో రోడ్డెక్కని రైతు లేడు.. రాస్తారోకో జరగని రహదారి లేదు
- ఆరు దశాబ్దాల పాటు పడ్డ కష్టాలు శాశ్వతంగా తీరిపోయాయి

హైదరాబాద్

పంట కొనుగోళ్ల సంక్షోభంపై ఎన్నాళ్లీ మొద్దునిద్ర ముఖ్యమంత్రి గారూ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కేబినెట్ మీటింగ్‌లోనైనా కళ్లు తెరవండి అని హితవు పలికారు. రైతుల ప్రాణాలు పోతున్నా.. పంటలు కొనరా..? కొనుగోలు కేంద్రాల్లో కుప్పకూలుతున్నా కనికరించరా అని మండిపడ్డారు. ధాన్యం తగలబెట్టుకుంటున్నా తండ్లాట తీర్చరా అని ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. కొనుగోలు కేంద్రాల్లో ఈ మరణ మృదంగమేంటని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో రోడ్డెక్కని రైతు లేడు.. రాస్తారోకో జరగని రహదారి లేదని అన్నారు. ఇవాళ - మిగతా3లో

# విదేశీ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలి

## తెలంగాణలో కార్మికులకు శుభవార్త

### కనీస వేతనాలు భారీగా పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం

- జూన్ 1 నుంచి అమల్లోకి పెంచిన వేతనాలు రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించిన ప్రభుత్వం
- జోన్-1-కార్పొరేషన్లు, జోన్-2- మున్సిపాల్టీలు , జోన్-3 గ్రామీణం
- నైపుణ్యాలు పెంచుకునేందుకు అవసరమైన ప్రోత్సాహకాలను ఇస్తున్నాం
- నైపుణ్యాలు పెంచుకుంటే విదేశాల్లో రూ.2లక్షల వరకు వేతనం ఉంటుంది
- ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించలేని చదువులు వ్యర్థం
- జర్మనీ, జపాన్, సింగపూర్‌లలో ఎన్నో ఉద్యోగాలు ఉన్నాయి



హైదరాబాద్

రాష్ట్రంలో కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. కార్మికుల కనీస వేతనాల పెంపునకు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘం నివేదిక మేరకు తీసుకున్న నిర్ణయాలను రేవంత్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుందని ఆయన వెల్లడించారు. జూన్ 1 నుంచి పెంచిన వేతనాలు అమల్లోకి రానున్నాయి. రాష్ట్రాన్ని ప్రభుత్వం మూడు జోన్లుగా విభజించింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్మికుల కనీస వేతనాలు నిర్ణయించకపోవడం వల్ల 1.11 కోట్ల మంది కార్మికులు నష్టపోయారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కనీస వేతన పెంపుపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం అన్ని వర్గాలతో - మిగతా3లో

## తమిళనాడు చరిత్రలో ఇదొక టర్నింగ్ పాయింట్



- క్యాబినెట్ బెర్తులు దక్కడంపై కాంగ్రెస్
- తమిళనాడు ప్రభుత్వం క్యాబినెట్ విస్తరణ
- కాంగ్రెస్ నుంచి ఇద్దరికి అవకాశం
- తమ పార్టీ నేతలు అధికారం కోసం విశ్వాసం, అంకితభావంతో గత 59 ఏళ్లుగా పనిచేస్తున్నారన్న హస్తం పార్టీ



ఇరాన్‌పై దాడి చేయాలా..

## శాంతి చర్చలా..?

- ట్రంప్, నెతన్యాహు మధ్య విభేదాలు
- ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేసిన సంగతి తెలిసిందే
- ప్రస్తుతం కాల్పుల విరమణ కొనసాగుతోంది
- శాంతి చర్చలు ఎటూ తేలడం లేదు.

# మందుబాబులకు బ్యాడ్‌న్యూస్

- భారీగా పెరగనున్న మద్యం ధరలు..
- తెలంగాణలోని మందుబాబులకు షాక్ తగలనుంది
- రాష్ట్రంలో మద్యం ధరలు భారీగా పెరగనున్నాయని సమాచారం
- జూన్ 2 తర్వాత దీనికి సంబంధించిన ప్రకటన ప్రభుత్వం నుంచి రావొచ్చని తెలుస్తోంది
- దీంతో మందుబాబులపై భారం పడనుంది
- బీర్ల ధరలు కూడా పెరగనున్నాయని తెలుస్తోంది
- అన్ని రకాల మద్యం ధరలు పెరగనున్నాయి



హైదరాబాద్

తెలంగాణలోని మందుబాబులకు షాకింగ్ న్యూస్. రాష్ట్రంలో మద్యం ధరలు భారీగా పెరగనున్నాయి. ఇప్పటికే ధరల పెంపుపై తుది నిర్ణయం తీసుకోగా.. త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని తెలుస్తోంది. ధరల పెంపుకు సంబంధించి ఇప్పటికే కమిటీ ప్రభుత్వానికి సిఫార్సులు చేసింది. దీంతో పాటు మద్యం తయారీ కంపెనీల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ క్రమంలో ధరలు పెంచక తప్పదని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో జూన్ 2 తర్వాత మద్యం ధరలు పెరగవచ్చని వార్తలు వినిపిస్తున్నాయి. దాదాపు 10 నుంచి 15 శాతం వరకు ధరలు పెరగవచ్చని చెబుతున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న వస్తోంది. దీంతో ఆ తర్వాత మందుబాబులకు రాష్ట్ర ప్రభుత్వం ఝలక్ ఇచ్చేందుకు రెడీ అవుతోంది. దాదాపు అన్ని రకాల మద్యం ధరలను పెంచేందుకు సిద్ధమవుతోంది. జూన్ 2 తర్వాత దీనికి సంబంధించిన ప్రకటన రావొచ్చని తెలుస్తోంది. మద్యం తయారీకి - మిగతా3లో




## 60 రోజుల్లో ఉద్యోగం తెచ్చుకోండి

- లేదంటే దేశం విడిచి వెళ్లండి..
- అమెరికాలో హెచ్1బి గండం
- అమెరికాలో ఉద్యోగం చేస్తున్న వేలమంది భారతీయులు ప్రస్తుతం ఉద్యోగాలు కోల్పోతున్నారు
- అమెరికాలో ఎదగాలని ఆశలు పెట్టుకున్న ఎంతోమంది భారతీయులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోక తప్పదు

## కుల సమూహంలో నష్టపోయేది మహిళలే..

- మహిళల అణచివేతకు కుల-పితృస్వామ్య వ్యవస్థే కారణం
- కులాల ప్రకారం మహిళలను అణగదొక్కే పితృస్వామ్య వ్యవస్థ మరోసారి వెలుగులోకి వచ్చింది
- కాంగ్రెస్‌లో తిరోగమన ఆలోచనలకు స్థానం లేదు..




హైదరాబాద్

కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసుపై కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ స్పందించారు. ఈ కేసుపై వస్తున్న వ్యాఖ్యలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధ సమానత్వానికి సమాజం ఇంకా చాలా దూరంలో ఉందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో పోక్సో కేసు తీవ్ర ఆందోళన కలిగించిందని పేర్కొన్నారు. గురువారం గాంధీభవన్‌లో మీడియాతో మీనాక్షి నటరాజన్ మాట్లాడారు. ఈ కేసులో బాధితురాలిని నిందించడం కాదని.. నేరస్తుల పెంపకాన్ని ప్రశ్నించాలని అన్నారు. నిర్భయ ఘటన నుంచి ఇప్పటి వరకు బాధితురాలినే నిందించే ధోరణి మారలేదని - మిగతా3లో

# వామ్మో.. 48 డిగ్రీలు!

సమ్మర్ హీట్ నెక్స్ట్ లెవెల్‌కి చేరింది. బయటకొచ్చారా.. మాడు పగిలిపోద్ది అంటూ డేంజర్ బెల్స్ మోగిస్తున్నాడు సూర్యుడు. ఎండల ధాటికి తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నిప్పుల కొలిమిలా మారిపోతున్నాయి. చాలా ప్రాంతాల్లో రోళ్లు, రాళ్లు పగిలే ఎండలు ప్రజలను బెంబేలెత్తిస్తోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు నరకం చూస్తున్నారు. రానున్న వారం రోజులపాటు ఇలానే ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు అత్యవసరం అయితే ఇళ్ల నుంచిబయటకు రావొద్దని సూచిస్తున్నారు. వచ్చే వారం రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత రికార్డు స్థాయిలో పెరుగుతుందని.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు అలర్ట్ జారీ చేశారు.



### పిడుగురాళ్లలో గరిష్ఠ ఉష్ణోగ్రత 48.1 డిగ్రీలు

ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు పాటించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. సోమవారం వరకు ఎండ తీవ్రత కొనసాగే అవకాశం ఉందని వీలైనంత వరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 మధ్య ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. గురువారం పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో గరిష్ఠ ఉష్ణోగ్రత 48.1 డిగ్రీలు నమోదైందని, 18 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు దాటినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 28 జిల్లాలకుగాను 20 జిల్లాల పరిధిలోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయని ఆయన వెల్లడించారు. ఇందులో ముఖ్యంగా పల్నాడు జిల్లాలో 26, ప్రకాశం 23, కృష్ణా 22, ఏలూరు 21, బాపట్ల 20, ఎన్టీఆర్ 15, గుంటూరు 14, మార్కాపురం 11 మండలాల్లో ఎండ ఉధృతి ఎక్కువగా చూపిందని పేర్కొన్నారు. తెలంగాణలో 45 డిగ్రీలు ఉష్ణోగ్రతలు దాటాయి.. ఖమ్మం జిల్లా ఏడూళ్ల బయ్యారంలో 46.2 డిగ్రీలు, రామగుండంలో 44.6, నిజామాబాద్‌లో 44.4 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి. రానున్న 5 రోజులు తెలంగాణలో నిప్పుల వర్షమేనని జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

### ఏపీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ హెచ్చరికలు

అలాగే శుక్రవారం(22-05-2026) 15 మండలాల్లో తీవ్రవడగాల్పులు, 219 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు.

వడగాల్పులు, అధిక ఉష్ణోగ్రతల నమోదైయ్యే మండలాల పూర్తి వివరాలు : ఈ లింక్‌ను క్లిక్ చేయండి..

రాబోవు రెండు రోజులు క్రింద విధంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యేందుకు అవకాశం ఉన్నట్లు ఏపిఎస్డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ వివరించారు

**మే 22 శుక్రవారం**

అల్లూరి సీతారామరాజు, పోలవరం, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45 - 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

కాకినాడ,నెల్లూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 43- 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురంమన్యం, విశాఖ పట్నం, అనకాపల్లి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 40 -- 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

**మే 23 శనివారం**

పోలవరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45 -- 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. కాకినాడ, నెల్లూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 44- 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. శ్రీకాకాళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 40 -- 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. గురువారం పల్నాడు(జి) పిడుగురాళ్లలో 48.1డిగ్రీలు, బాపట్ల(జి) వేటపాలెం, కృష్ణా(జి) నందివాడ 47.6, ఎన్టీఆర్ (జి) తొర్రగుడిపాడు, ప్రకాశం(జి) అద్దంకిలో 47.4, ఏలూరు(జి) అల్లిపల్లిలో 47.3, మార్కాపురం(జి) నందనమారెళ్లలో 46.6, పోలవరం(జి) కూనవరంలో 46.5, నెల్లూరు(జి) కావలిలో 46.4, గుంటూరు(జి) తెనాలిలో 46, తూర్పుగోదావరి(జి) బ్రహ్మణగూడెంలో 45.8, పశ్చిమ గోదావరి(జి) తాడేపల్లిలో 45.5, విశాఖ(జి) ములగాడలో 45.2, అనకాపల్లి(జి) మాకవరపాలెం, కోనసీమ(జి) రామచంద్రాపురం, తిరుపతి(జి) బోనుపల్లెలో 45.1, కాకినాడ(జి) కందరాడ, విజయనగరం(జి) గుర్లలో 45 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా వృద్దులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎండలో బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాదులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు,మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. మరోవైపు ఉపరితల ఆవర్తన ప్రభావంతో అల్లూరి, పోలవరం, నెల్లూరు రాయలసీమలో చెదురుమదురుగా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద నిలబడరాదన్నారు.

# తమిళనాడు చరిత్రలో ఇదొక టర్నింగ్ పాయింట్

గత 59 ఏళ్లుగా విశ్వాసంతో పనిచేస్తున్న హస్తం పార్టీ కార్యకర్తలకు జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళనాడు మంత్రివర్గంలో చోటు దక్కడం ఒక వరంగా అభివర్ణించింది కాంగ్రెస్. అధికారం కోసం విశ్వాసంతో, అంకితభావంతో ఇన్నాళ్లుగా కాంగ్రెస్ కార్యకర్తలు పోరాడుతున్నారని పేర్కొంది. ఇప్పుడు వారికి అధికారం దక్కిందని వెల్లడించింది. తమిళనాడు రాజకీయ చరిత్రలో దీన్నొక మలుపుగా అభివర్ణించింది. విజయ్ క్యాబినెట్‌లో తమ పార్టీకి చెందిన ఇద్దరికి మంత్రి పదవుల దక్కిన నేపథ్యంలో తమిళనాడు, పుదుచ్చేరి ఏఐసీసీ ఇన్‌చార్జ్ గిరీశ్ చోడంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. "తమిళనాడు ప్రజల తీర్పు సంకీర్ణ ప్రభుత్వానికి ఉన్న మద్దతును స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. అధికారంలో వాటా కోసం మా కార్యకర్తలు పోరాడుతున్నారు. ఈ రోజు కాంగ్రెస్ కార్యకర్తలకు అధికారం దక్కింది. తమిళ ప్రజలు లౌకిక, ప్రగతిశీల ప్రభుత్వాన్ని కోరుకున్నారు" అని గిరీశ్ చోడంకర్ పేర్కొన్నారు.



### తమిళనాడులో కోల్పోయిన పట్టును తిరిగి సాధిస్తాం : మాణికం ఠాగూర్

సంకీర్ణంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ సాధారణంగా అధికారాన్ని పంచుకుంటుందని కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ అన్నారు. అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే జరిగిందన్నారు. తాము ఇతరుల విజయం (డీఎంకేనుద్దేశించి) కోసం పనిచేసి, ఎన్నికలు ముగిశాక బయట కూర్చోవాల్సి వచ్చిన ఏకైక రాష్ట్రం తమిళనాడు మాత్రమేనని వెల్లడించారు. తమిళనాడులో కాంగ్రెస్ కోల్పోయిన పట్టును తిరిగి పొందడానికి అధికారం సహాయపడుతుందని అభిప్రాయపడ్డారు. "రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయాలనే వాదనను ముందుకు తీసుకెళ్లడానికి ఇది బలమైన ఊపునిస్తుంది. తమిళనాడు, పుదుచ్చేరిలో ఉన్న మొత్తం 40 ఎంపీ స్థానాలను మేమే గెలుస్తామని మాకు పూర్తి నమ్మకం ఉంది." అని మాణికం ఠాగూర్ తెలిపారు.

### 'ఈ పరిణామం పార్టీ శ్రేణుల్లో జోష్‌ని నింపింది'

అధికారంలో వాటా అనేది కాంగ్రెస్ కార్యకర్తలు పడిన కఠోర శ్రమకు లభించిన గౌరవం, ఆత్మగౌరవానికి సంకేతమని సీనియర్ కాంగ్రెస్ నేత ప్రవీణ్ చక్రవర్తి పేర్కొన్నారు. ఈ పరిణామం పార్టీ శ్రేణుల్లో కొత్త శక్తిని, ఉత్సాహాన్ని నింపిందని తెలిపారు. 1952 నుంచి తమిళనాడులో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడలేదన్నారు. అధికారం, పరిపాలనలో తమకు వాటా కావాలని కాంగ్రెస్ కార్యకర్తలు, జిల్లా అధ్యక్షులు, నాయకులు నిరంతరం డిమాండ్ చేస్తూ వచ్చారని గుర్తు చేసుకున్నారు.

### రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్ నమోదు చేస్తాం : సెల్వపెరుంతగై

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి రోజే కాంగ్రెస్ నేతల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతోందని టీఎన్‌సీసీ అధ్యక్షుడు కె. సెల్వపెరుంతగై అన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం కోసం రాజ్‌భవన్‌కు వెళ్లే ముందు కాంగ్రెస్ నాయకులు, కాబోయే మంత్రులు ఉదయాన్నే శ్రీపెరుంబుదూర్‌లోని రాజీవ్ గాంధీ స్మారక చిహ్నాన్ని సందర్శించి నివాళులర్పించారని తెలిపారు. తమిళనాడులో భవిష్యత్తులో గెలిచే ఏ కూటమి అయినా సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడు, పుదుచ్చేరిలో ఉన్న 40 స్థానాలకు గెలుచుకుని, 100 శాతం స్ట్రైక్ రేట్‌ను నమోదు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

మరోవైపు, విజయ్ క్యాబినెట్‌లో మంత్రిగా ప్రమాణం స్వీకారం చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎస్. రాజేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. క్షేత్రస్థాయి పార్టీ కార్యకర్తల ఆకాంక్షలను నెరవేర్చడమే తన ప్రధాన బాధ్యతని పేర్కొన్నారు. దాదాపు 60 ఏళ్ల తర్వాత తమ కార్యకర్తల ప్రగాఢ ఆకాంక్ష నెరవేరిందన్నారు. తాగునీరు, రోడ్లు, ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలు వంటి ప్రాథమిక సమస్యలపై తాను ప్రధానంగా దృష్టి సారిస్తానని వెల్లడించారు.

### టీవీకే కూటమి చెక్కుచెదరలేదు మంత్రి ఆధవ్ అర్జున

రాష్ట్ర మంత్రివర్గం ఒకే కుటుంబంలా పనిచేయాలని, ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న మిత్రపక్షాలన్నింటికీ తగిన ప్రాతినిధ్యం కల్పించాలని తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ఆకాంక్షించారని టీవీకే నేత, రాష్ట్ర మంత్రి ఆధవ్ అర్జున పేర్కొన్నారు. టీవీకే నేతృత్వంలోని కూటమి చెక్కుచెదరకుండా ఉందని, త్వరలో మరి కొందరికి క్యాబినెట్ బెర్తులు దక్కుతాయని వెల్లడించారు.

### విజయ్ క్యాబినెట్ విస్తరణ

ప్రభుత్వం ఏర్పడిన దాదాపు రెండు వారాల తర్వాత విజయ్ తన మంత్రివర్గాన్ని గురువారం విస్తరించారు. ఈ క్రమంలో టీవీకేకి చెందిన 21 మంది, కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు (రాజేశ్ కుమార్, విశ్వనాథన్) మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ప్రమాణం చేయించారు. దీంతో విజయ్ మంత్రి వర్గం సంఖ్య 33కు చేరింది.

### రాహుల్, రాజీవ్‌పై ప్రశంసలు- గవర్నర్ అభ్యంతరం

మరోవైపు, కాంగ్రెస్ నేత రాజేశ్ కుమార్ తాను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో ఆ పార్టీ నాయకులైన కామరాజ్, రాజీవ్ గాంధీ, రాహుల్ గాంధీలను ప్రశంసించారు. దీనిపై గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ వ్యాఖ్యలు మీ ప్రమాణంలో భాగం కాదని రాజేశ్‌కు తెలియజేశారు. పేపర్‌పైన ఉన్న లిఖిత ప్రమాణానికే కట్టుబడి ఉండాలని సూచించారు.

### మంత్రులకు శాఖలు కేటాయింపు

అలాగే కొత్త మంత్రులకు విజయ్ శాఖలను కేటాయించారు. కొన్ని మంత్రిత్వ శాఖలను పునర్ కేటాయించారు. శాఖల కేటాయింపునకు గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ ఆమోదం తెలిపారు. కాంగ్రెస్ నాయకులు రాజేశ్ కుమార్‌కు టూరిజం, విశ్వనాథన్‌కు ఉన్నత విద్యా శాఖను కేటాయించారు. టీవీకే నేత మేరీ విల్సన్‌కు ఆర్థిక, ప్రణాళిక, డెవలప్‌మెంట్ శాఖను అప్పగించారు. మహ్మద్ ఫర్వాస్‌కు కార్మిక సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి శాఖను ఇచ్చారు. పేదరిక నిర్మూలన శాఖను సీఎం విజయ్ తన వద్దే ఉంచుకున్నారు. తన వద్ద ఉన్న మహిళా సంక్షేమ శాఖను జగదీశ్వరికి కేటాయించారు. గతంలో ఆర్థిక శాఖను నిర్వహించిన సెంగోట్టయ్యన్‌కు ఇప్పుడు రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖను అప్పగించారు. మరోవైపు, టీవీకే క్యాబినెట్‌లో చేరనున్నట్లు ఐయూఎంఎల్ ప్రకటించింది. తమ పార్టీ ఎమ్మెల్యే షాజహాన్‌ను మంత్రివర్గంలో చేర్చుకోవాలని సిఫార్సు చేయనున్నట్లు వెల్లడించింది.

## 60 రోజుల్లో ఉద్యోగం తెచ్చుకోండి..




మెటా, అమెజాన్ సహా అనేక టెక్ కంపెనీలు లేఆఫ్స్ ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే. అమెరికాలోని కంపెనీల్లోనూ ఉద్యోగుల్ని తొలగిస్తున్నారు. ఇలా ఉద్యోగాలు కోల్పోతున్న వారిలో భారతీయులు కూడా ఉన్నారు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న వేలమంది భారతీయులు ప్రస్తుతం ఉద్యోగాలు కోల్పోతున్నారు. ఇప్పుడు వారి సమస్య ఉద్యోగమే కాదు.. అమెరికా ఆవాసం కూడా. ఎందుకంటే ఉద్యోగాలు కోల్పోయిన వారు దేశంలో చట్టబద్ధంగా ఉండేందుకు ఉన్న హక్కును కోల్పోతారు. ఉద్యోగం లేకుంటే హెచ్1బీ వీసా రద్దవుతుంది. ఇదే జరిగితే వేలాది మంది భారతీయుల డాలర్ డ్రీమ్స్ చెదిరిపోతాయి. అమెరికాలో ఎదగాలని ఆశలు పెట్టుకున్న ఎంతోమంది భారతీయులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోక తప్పదు. ఇటీవల అమెజాన్, మెటా, ఒరాకిల్ వంటి అనేక సంస్థలు వరుసగా ఉద్యోగుల్ని తొలగిస్తున్నాయి. ఇలా జాబ్ కోల్పోయిన వారి హెచ్1బీ వీసా స్టేటస్ రద్దవుతుంది. అయితే, వీరికి అక్కడి నిబంధనల ప్రకారం.. హెచ్1బీ వీసా హక్కు తిరిగి పొందాలంటే ఉద్యోగం కోల్పోయిన వారు 60 రోజుల్లోగా తిరిగి ఉద్యోగం పొందాలి. ఇది గ్రేస్ పీరియడ్. ఈ కాలంలోపు ఉద్యోగం పొంది స్పాన్సర్‌షిప్ పొందితేనే అమెరికాలో ఉండటానికి అవకాశం ఉంటుంది. ఒకవేళ 60 రోజుల్లో ఉద్యోగం పొందకపోతే అలాంటివారిని గుర్తించి, బలవంతంగానైనా అమెరికా నుంచి పంపించి వేస్తారు. ప్రస్తుతం లేఆఫ్స్ వల్ల భారతీయులు లక్షలాదిగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా మంది ఏళ్లుగా అక్కడ పని చేస్తున్నారు. కొందరు ఇంటి కోసం లోన్లు తీసుకున్నారు. పిల్లల్ని అక్కడే చదివిస్తున్నారు. పర్మినెంట్ నివాసం కోసం ఎదురుచూస్తున్నారు. ఇలాంటి సమయంలో అక్కడ ఉద్యోగాలు కోల్పోతుండటం తీవ్రంగా కలవరపెడుతోంది. అయితే, ఇలా ఉద్యోగాలు కోల్పోతున్న వారు మరికొంతకాలం అమెరికాలో ఉండి ఉద్యోగం వెతుక్కునేందుకు వీలుగా ప్రస్తుతం తాత్కాలికంగా బీ--2 విజిటర్ వీసాల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇటీవలి కాలంలో ఈ వీసాల కోసం దరఖాస్తులు భారీగా పెరిగిపోయాయి. ఈ వీసాలు పొందితే అమెరికాలో మరో ఆరు నెలలపాటు ఉండే అవకాశం దొరుకుతుంది. కానీ, దీనివల్ల కూడా అక్కడ అనేక న్యాయపరమైన చిక్కులు ఏర్పడే అవకాశాలున్నాయి. ఈ వీసాలు పొందడం కూడా కష్టంగా మారుతోంది. ఇందుకోసం అనేక డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉంటుంది. అమెరికాలోని కంపెనీల్లో ఈ ఏడాదిలోనే 1,10,000 మంది ఉద్యోగాలు కోల్పోయినట్లు నివేదికలు చెబుతున్నాయి.

## ఇరాన్‌పై దాడి చేయాలా.. శాంతి చర్చలా..?



ఇరాన్‌పై దాడి విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు మధ్య విబేధాలు వచ్చినట్లు కనిపిస్తోంది. తాజాగా ఇద్దరిమధ్యా జరిగిన ఫోన్ సంభాషణలో పరస్పరం విబేధించుకున్నట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కాల్పుల విరమణ కొనసాగుతోంది. శాంతి చర్చలు ఎటూ తేలడం లేదు. ఈ నేపథ్యంలో మళ్లీ దాడి చేసే అంశాన్ని అమెరికా పరిశీలిస్తోంది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఇరాన్‌పై రాబోయే రోజుల్లో ఎలా వ్యవహరించాలి అనే అంశంపై ట్రంప్, నెతన్యాహు చర్చించారు. వారు ఇద్దరూ దాదాపు గంటసేపు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. అయితే, ఇరాన్‌తో వ్యవహరించాల్సిన అంశంలో ఇద్దరూ పరస్పర అభిప్రాయాల్ని వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై త్వరగా యుద్ధాన్ని ప్రారంభించాలని నెతన్యాహు డిమాండ్ చేశారు. కానీ, కొంతకాలం వేచి చూద్దామని ట్రంప్ అన్నారు. ప్రస్తుతం ఇరాన్‌తో చర్చలు సాగుతున్నందున కొంతకాలంపాటు దౌత్యపరమైన చర్చలకు అవకాశం ఇద్దామని ట్రంప్ అన్నారు. ఈ నిర్ణయాన్ని నెతన్యాహు వ్యతిరేకించారు. ఇరాన్‌పై సైనిక ఒత్తిడి తేవాలని నెతన్యాహు కోరారు. ఇరాన్‌పై మళ్లీ దాడులు చేసి, ఆ దేశ సైన్యాన్ని ఇంకా బలహీన పర్చాలని, ఇరాన్‌లోని కీలక నిర్మాణాలపై దాడులు చేసి ధ్వంసం చేయాలని ట్రంప్‌నకు నెతన్యాము సూచించారు. దీనివల్ల ఇరాన్‌ను ఇంకా ఒత్తిడిలోకి నెట్టవచ్చని అభిప్రాయపడ్డారు. కానీ, ఈ ప్రతిపాదనను ట్రంప్ సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చర్చలు కీలక దశకు చేరుకున్నాయని, ఇలాంటి దశలో దాడులు చేయలేమని, త్వరలోనే చర్చల ద్వారా ఒక పరిష్కారం లభిస్తుందని ట్రంప్ భావిస్తున్నట్లు తెలిపారు. అయినప్పటికీ ఇరాన్‌పై సైనిక చర్యకు అమెరికా సిద్ధంగానే ఉందన్నారు. కానీ, చర్చలకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ట్రంప్ నెతన్యాహుతో చెప్పారు. ప్రస్తుతం ఖతార్, పాకిస్తాన్‌లు ఇరాన్‌తో మధ్యవర్తిత్వం వహిస్తూ సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. తమ ప్రతిపాదనలకు ఇరాన్ త్వరలోనే అంగీకరిస్తుందని భావిస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. అయితే, ట్రంప్ నిర్ణయంపై నెతన్యాహు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో త్వరలోనే నెతన్యాహు అమెరికాలో పర్యటించబోతున్నట్లు తెలుస్తోంది.

## ఎయిరిండియా విమానానికి తప్పిన ప్రమాదం

**బెంగళూరు:** ఎయిరిండియా విమానానికి ప్రమాదం తప్పింది. ల్యాండింగ్ సమయంలో రన్‌వేను విమాన చివరి భాగం(తోక) తగలడంతో ఒక్కసారిగా కలవరం మొదలంది. ఢిల్లీ నుంచి నుంచి బెంగళూరుకు వచ్చిన ఎయిర్ ఇండియా విమానం ల్యాండ్ అవుతుండగా ఇది చోటు చేసుకుంది. ఆ సమయంలో విమానంలో 181 ప్రయాణికులు ఉన్నారు. ఎయిర్ ఇండియా విమానం ఞా×2651లో ఇది చోటు చేసుకుంది. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విమానం ల్యాండింగ్ తర్వాత క్షుణ్ణంగా పరిశీలించారు. ల్యాండింగ్ కోసం సమీపిస్తున్నప్పుడు విమానం తీవ్రమైన కుదుపులకు గురైంది. ఈ అస్థిరమైన ల్యాండింగ్ ప్రయత్నం తరువాత పైలట్ గో-అరౌండ్ (ల్యాండింగ్ ప్రయత్నాన్ని రద్దు చేసి మళ్లీ గాల్లోకి ఎగిరి, మరోసారి ల్యాండింగ్ ప్రయత్నం చేయడం) చేయాలని నిర్ణయించుకున్నారు. ఇది చేస్తున్నప్పుడు విమాన చివరి భాగం నేలను తాకింది. విమానం సురక్షితంగా ల్యాండ్ అయిందని, ప్రయాణీకులు, సిబ్బంది అందరూ క్షేమంగా ఉన్నారని ఎయిర్ ఇండియా ప్రతినిధి పీటీఐకి తెలిపారు.



# పంట కొనుగోళ్ల సంక్షోభంపై ఎన్నాళ్లీ మొద్దు నిద్ర..

-మొదటిపేజీ తరువాయి

బూతులు తిడుతున్న రైతులే.. రేపు వాతలు పెడతారని హెచ్చరించారు. కాంటా పెట్టని కాంగ్రెస్ సర్కారుకు రైతు చేతిలోనే కౌంట్ డౌన్ మొదలైందని అన్నారు.

**కేటీఆర్ రాసిన లేఖ యథాతథంగా..**

‘ తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిదిన్నరేళ్లపాటు కొండంత ధైర్యంతో బతికిన అన్నదాత ఇవాళ అత్మవిశ్వాసం కోల్పోయి రోడ్డున పడ్డాడు. ఆరు దశాబ్దాల పాటు పడ్డ కష్టాలు శాశ్వతంగా తీరిపోయాయని సంబరంగా సాగుచేసుకుంటున్న రైతు నోట్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మట్టి కొట్టింది. రైతుకు రక్షణగా కేసీఆర్ గారు అమలుచేసిన ఒక్కో పథకానికి గత రెండేన్నరేళ్లుగా పాతరేసిన మీరు మీ చేతకానితనంతో అన్నదాత వెన్నువిరిచారు.తెలంగాణ సమాచారం

ఇవాళ మీ అరాచక పాలన ఆనవాళ్లు పరాకాష్టకు చేరాయి. అష్టకష్టాలు పడి పండించిన పంటను కొనే దిక్కులేక రెండునెలలుగా రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఆర్థనాదాలు చేస్తున్నారు. చేతకాని మీ సర్కారు నిర్వాకం వల్ల తెలంగాణ వ్యాప్తంగా ఏ మూలన చూసినా ఈరోజు రైతులు నిత్యం ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలతో హోరెత్తిస్తున్నారు. పంట అమ్ముకుందామనే ఆశతో వచ్చిన రైతులు రోజుల తరబడి పడిగాపులు పడలేక కొనుగోలు కేంద్రాల్లోనే గుండెపగిలి కుప్పకూలుతున్నా మీ సర్కారుకు చీమకుట్టినట్టు కూడా లేదు. 70 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టడంలో మీకున్న శ్రద్ధలో ఒక్క శాతం రైతులపై పెట్టి ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదు.

మీ కుర్చీని కాపాడుకోవడానికి ఢిల్లీకి మూటలు మోయడం తప్ప రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనాలన్న సోయి మాత్రం మీలో కనిపించడం లేదు. పెట్టుబడి సాయాన్ని వరుసగా నాలుగు సార్లు ఎగ్గొట్టినా, యూరియా కష్టాల పాలుజేసినా రైతులు అన్నింటినీ దిగమింగి పండించిన ఏ పంటను మీ ప్రభుత్వం కొనుగోలు చేసిన పాపాన పోలేదు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద దాదాపు పదిమంది రైతులు వడదెబ్బకు తోడు సర్కారు చేసిన ద్రోహానికి తమ నిండు ప్రాణాలు కోల్పోయారు. అయినా కనీసం ఒక్కసారైనా మీరు ఏ ఒక్క కొనుగోలు కేంద్రం వైపు కన్నెత్తి చూసిన దాఖలా లేదు. అందుకే రైతులు మరో మార్గం కనిపించక, ఇంతకాలం కంటిపాపలా పెంచుకున్న పంటను తమ చేతులతోనే తగలబెట్టుకుంటున్నారు. ఇవాళ తెలంగాణలోని రోడ్లపై కాలిబూడిదవుతున్న ధాన్యం కుప్పలు మీ అసమర్థతకు ప్రత్యక్ష సాక్ష్యాలు. గత రెండు నెలలుగా రాష్ట్రంలో నిరసనలో పాల్గొనని రైతు లేడు, రాస్తారోకో జరగని రహదారి లేదు. ఈ 30 నెలల్లోనే సమైక్యరాష్ట్రం నాటి సకల కష్టాల్లో మళ్లీ



రైతులను ముంచెత్తారు. ఇన్నాళ్లు సంతోషంగా సాగిన సాగును కన్నీటి సేద్యంగా మార్చారు. కష్టాల్లో కొట్టమిట్టాడుతున్న తెలంగాణ రైతుల కన్నీళ్లతో ఖాళీగా ఉన్న రిజర్వాయర్లు నిండేలా ఉన్నాయి. పగలూ రాత్రి ప్రజాసంపదను దోచుకోవడంపై తప్ప పరిపాలనపై మీకు కనీస పట్టులేకపోవడం అన్నదాతకు శాపంగా మారింది. విలువైన భూములను తెగనమ్మి వేలకోట్లు దోచుకోవాలన్న ఉత్సాహం తప్ప రైతుల పంటలను కొనాలన్న ధ్యాస మీలో ఏమాత్రం కనిపించడం లేదు. రోడ్లపై జరుగుతున్న నిరసనలనుంచి తప్పించుకునేందుకు, మీ మంత్రులు హెలికాప్టర్ లో షికార్లు కొడుతున్నారు. చివరికి మీ సొంత నియోజకవర్గం కొడంగల్ లో కూడా రైతులు రోడ్డెక్కి దుమ్మెత్తి పోసే దుస్థితి వచ్చిందంటే, సాగు ఎంతటి సంక్షోభాన్ని ఎదుర్కొంటుందో అర్థం చేసుకోవచ్చు.

వరంగల్ నుంచి ఖమ్మం దాకా అనేక జిల్లాల్లోని కొనుగోలు కేంద్రాల్లో రోజుకు కనీసం ఒక్కటంటే ఒక్క లారీ లోడ్ కూడా ఎత్తడం లేదు. ఇక అడపా దడపా చేసే కొనుగోళ్లలోనూ ఒక్కోచోట 10 కిలోలకు పైగా తరుగుతీస్తే ఇక రైతులకు మిగిలేదేంటో మీరే సమాధానం చెప్పాలి. చివరికి గన్నీ బ్యాగు కోసం రైతులే 50 రూపాయల చొప్పున డిపాజిట్ చేసే దుస్థితి తెచ్చినందుకు మీరు, మీ ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలి. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బోనస్ ఇచ్చే ముఖం మీ సర్కారుకు ఎలాగూ లేదని ఇప్పటికే తేలిపోయింది. చివరికి పంట కొనుగోలు కూడా చేయడం చేతకాకపోతే రాష్ట్రంలోని 60 లక్షల మంది రైతులకు మీరు క్షమాపణలు చెప్పి ముక్కు నేలకు రాయండి. అన్నదాతలు అడుగడుగునా పడిగాపులు పడుతుంటే వాటిని వదిలేసి, పర్యాటక వారోత్సవాలు నిర్వహించాలన్న మీ సర్కారుకు ప్రాధాన్యతలే కాదు, చివరికి పోయి కూడా లేదని తేలిపోయింది.

కేసీఆర్ గారి హయాంలో మూడు నెల ముందు నుంచే పంటల కొనుగోలు ప్రణాళికలను పకడ్బందీగా అమలుచేసే వారు. గన్నీ బ్యాగుల నుంచి మొదలుకుని రైతుల ఖాతాల్లో పంట డబ్బులు సకాలంలో జమ అయ్యేదాకా నిరంతర సమీక్షలతో పర్యవేక్షించేవారు. కరోనా కష్టకాలంలోనూ రైతు కల్లాల వద్దకే వెళ్లి చివరి గింజ వరకూ కొని రైతుల్లో అచెంచలమైన ఆత్మవిశ్వాసాన్ని నింపారు. అలా పండుగలా సాగిన వ్యవసాయంపై మీరు పగబట్టి రైతులకు చేసిన ద్రోహం అందరికీ అర్థమైపోయింది. రైతులు తమ పంటకు నిప్పు పెట్టుకుంటున్నా మొద్దునిద్ర వీడని ముఖ్యమంత్రిని చూసి యావత్ రైతాంగం శాపనార్థాలు పెడుతోంది. కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాల నుంచి తమ పంటను కాపాడుకునేందుకు చివరికి టార్పాలిన్లు కూడా సమకూర్చలేని మీ కాంగ్రెస్ సర్కారు ఉండి రైతులకు ఏం ప్రయోజనం. అనేక చోట్ల చెడగొట్టు వానలు పడి కళ్లముందే పంట కొట్టుకుపోతున్నా కాపాడుకోలేని నిస్సాహాయ స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

బీఆర్ఎస్ హయాంలో సంబురంగా సాగిన సాగును కష్టాల కడలిలో ముంచెత్తిన మీ పాపానికి ఇప్పటికే వెయ్యి మందికి పైగా రైతులు ఆత్మహత్యల పాలయ్యారు. రైతుల ఆర్థనాదాలు ఏమాత్రం వినిపించుకునే తీరిక లేని మీ పాలనకు రోజులు దగ్గరపడ్డాయి. మొత్తంగానే వ్యవసాయాన్ని పాతాళంలోకి నెట్టిన మీ దద్దమ్మ పాలనపై ఇప్పటికే రైతుల్లో తిరుగుబాటు మొదలైంది. 60 రోజులు గడిచినా కొనుగోలు కేంద్రాల్లో కాంటా పెట్టని కాంగ్రెస్ సర్కారుకు మరణశాసనం రాసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

రాష్ట్రమంతా రైతుల నిరసనలు హోరెత్తుతున్న ఈ తరుణంలో 23న నిర్వహించే కేబినెట్ సమావేశంలోనైనా లెంపలేసుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టండి. వేలాది కొనుగోలు కేంద్రాల్లో గుట్టలుగా పేరుకుపోయిన ప్రతి పంటను కొని వెంటనే రైతుల కష్టానికి ప్రతిఫలాన్ని అందించండి. అలాగే మీరు చేసిన పాపాలకు ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద కన్నుమూసిన రైతుల కుటుంబాలకు 25 లక్షల చొప్పున పరిహారం ప్రకటించండి. లేకపోతే మీరు చరిత్రలో ఎప్పటికీ రైతు ద్రోహిగానే మిగిలిపోతారు.’ అని సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో కేటీఆర్ పేర్కొన్నారు.

# బీజేపీ అస్త్రం... ఎస్ఐఆర్

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య సరికొత్త వ్యూహాత్మక యుద్ధం మొదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 25 నుంచి జులై 24 వరకు రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ కొనసాగనుంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, మరణించిన వారి వివరాలను తొలగించడం, ఒకే పేరుతో రెండు చోట్ల ఉన్న నకిలీ ఓట్లను ఏరివేయడమే ఈ ఇంటింటి ఓటర్ల సర్వే ముఖ్య ఉద్దేశం. అయితే, ఈ ప్రభుత్వ అధికారిక ప్రక్రియను ఒక అద్భుతమైన రాజకీయ అవకాశంగా మార్చుకునేందుకు భారతీయ జనతా పార్టీ సర్వసన్నద్ధమైంది. గతంలో పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో అత్యంత విజయవంతమైన ఫలితాలను ఇచ్చిన మైక్రో-లెవెల్ మేనేజ్‌మెంట్ ఫార్ములాను ఇప్పుడు తెలంగాణలోనూ అమలు చేసేందుకు కమలనాథులు పక్కా స్కెచ్ వేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ అధిష్టానం, రాష్ట్రంలోని జిల్లాలను ఆరు జోన్లుగా విభజించింది. ఎన్నికల నిర్వహణ, సమన్వయాన్ని సులభతరం చేసేందుకు ఒక్కో జోన్ పరిధిలోకి దాదాపు 7 జిల్లాలు వచ్చేలా ప్లాన్ చేశారు. పార్టీలోని కీలక నేతలకు ఒక్కొక్కరికి 7 జిల్లాల చొప్పున పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. కేవలం పైస్థాయి ప్రకటనలకే పరిమితం కాకుండా, ప్రతి ఒక్క కార్యకర్త క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.ప్రభుత్వ బూత్ లెవెల్ అధికారులు ఇళ్లకు వెళ్ళినప్పుడు, వారితో పాటు బీజేపీ బూత్ లెవెల్ ఏజెంట్స్ కూడా ప్రతి ఇంటినీ సందర్శించనున్నారు. ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి.. అందులో పార్టీ మద్దతుదారులు ఎవరున్నారు, తటస్థంగా ఉన్న ఓటర్లు ఎవరు అనే అంశాలపై స్పష్టమైన మార్కింగ్ చేయనున్నారు. దీని ద్వారా ఏ బూత్‌లో పార్టీ బలం ఎంత ఉందనేదానిపై ఒక కచ్చితమైన అంచనాకు రానున్నారు. ముఖ్యంగా మరణించిన వారి ఓట్లతో పాటు, చొరబాటుదారుల ఓట్లను తొలగించడంపైనే తాము ప్రధానంగా ఫోకస్ పెట్టినట్లు బీజేపీ స్పష్టం చేస్తోంది.బీజేపీ



ఎంచుకున్న ఈ క్షేత్రస్థాయి వ్యూహం తెలంగాణ అధికార పార్టీ కాంగ్రెస్తో పాటు, ప్రతిపక్ష బీఆర్ఎస్‌లోనూ తీవ్ర కలకలం రేపుతోంది. కాషాయదళం ప్రభుత్వ వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ.. పథకం ప్రకారం తమ మద్దతుదారుల ఓట్లను అక్రమంగా తొలగించే ప్రయత్నం చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఆరోపిస్తున్నారు. బీజేపీ మైక్రో-ప్లాన్‌ను తిప్పికొట్టేందుకు ఈ రెండు పార్టీలు కూడా తమ బూత్ లెవెల్ కార్యకర్తలను అప్రమత్తం చేసి, ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. జూన్ 25 నుంచి క్షేత్రస్థాయిలో మూడు పార్టీల కార్యకర్తల మధ్య ఓటర్ల సర్వే వేదికగా గట్టి ఘర్షణ వాతావరణం నెలకొనే అవకాశం కనిపిస్తోంది.ఈ ఏడాది చివరిలో జరగబోయే ఉఊఓఅ ఎన్నికలపై ఈ సర్వే ప్రభావం ఎలా ఉండబోతోందనే ప్రశ్నే ఇప్పుడు ప్రధాన పార్టీలను తొలిచేస్తోంది. హైదరాబాద్ మున్సిపల్ పరిధిలో స్థానిక జనాభాతో పాటు వలస వచ్చిన వారి సంఖ్య చాలా ఎక్కువ. ఎస్ఐఆర్ ద్వారా సేకరించే డేటాను విశ్లేషించి, ఏయే డివిజన్లలో ఏ వర్గాల ఓటర్లు బలంగా ఉన్నారో ముందే గుర్తించడం ద్వారా అభ్యర్థుల ఎంపికను వేగవంతం చేయా లని బీజేపీ భావిస్తోంది. ఎస్ఐఆర్ ను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మార్చుకుంటూ, అటు సంక్షేమంపై అధికార కాంగ్రెస్‌ను నిలదీస్తూనే, ఇటు క్షేత్రస్థాయి సమీకరణాలను తనకు అనుకూలంగా మార్చుకోవాలని బీజేపీ గట్టి పట్టుదలతో ఉంది. జూన్ 25 నుంచి నెల రోజుల పాటు సాగనున్న ఈ ‘స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్’ ప్రక్రియ పూర్తయ్యాక, గ్రేటర్ మున్సిపల్ రాజకీయం ఏ మలుపు తిరుగుతుందో చూడాలి.

# ఇక రణమే.... భగీరథ్ చిచ్చు

**హైదరాబాద్ :** తెలంగాణలో మూడు ప్రధాన పార్టీలున్నాయి. అయితే బీజేపీ ? బీఆర్ఎస్ ఒక్కటేనని అధికార కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ ఆరోపిస్తూ వస్తోంది. ఆ రెండు పార్టీల మధ్య తెరవెనుక పొత్తు ఉందని చెప్తూ వచ్చింది. అయితే ఇప్పుడు అలాంటి ఊహాగానాలకు తెరపడింది. బండి భగీరథ్ కేసు వ్యవహారం ఆ రెండు పార్టీల మధ్య గ్యాప్ పెంచేసింది. భగీరథ్‌పై నమోదైన కేసు, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు రాష్ట్రంలో పొత్తుల సమీకరణాలను మార్చేసినట్లు అర్థమవుతోంది. ఢిల్లీ పెద్దలపై ఈగ వాలనివ్వకుండా కేవలం రాష్ట్ర స్థాయి నేతలనే టార్గెట్ చేస్తూ వస్తున్న గులాబీ బాసులు.. ఒక్కసారిగా రూట్ మార్చారు. తాజా పరిణామాలతో తెలంగాణ పీఠం కోసం పక్కాగా త్రిముఖ పోరు ఖాయమనే విషయం స్పష్టమైంది.బండి భగీరథ్ ఉదంతాన్ని ఒక సాధారణ లీగల్ ఇష్యూగా వదిలేయడానికి బీఆర్ఎస్ అస్సలు సిద్ధపడలేదు. దొరికిన అస్త్రాన్ని పదునుపెట్టి కమలనాథుల గుండెల్లో దింపింది. బండి సంజయ్‌ను కేంద్ర మంత్రిమండలి నుంచి బర్తరఫ్ చేయాలంటూ స్వయంగా కేటీఆర్ రంగంలోకి దిగడం, రాష్ట్రవ్యాప్తంగా గులాబీ కేడర్ రోడ్లపైకి వచ్చి నిరసనలతో హోరెత్తించడం చూసి బీజేపీ మైండ్ బ్లాంక్ అయింది. తమతో సయోధ్య, గియోధ్య లాంటి ముచ్చట్లేవీ లేవని, అవకాశం దొరికితే చట్టపరమైన ఉచ్చులతో రాజకీయ సమాధి కట్టడానికి బీఆర్ఎస్ ఎంతకైనా తెగిస్తుందనే చేదు నిజం ఢిల్లీ పెద్దలకు ఈ దెబ్బతో అర్థమైంది.ఈ దెబ్బతో బీజేపీ అధిష్టానం



తన సాఫ్ట్ కార్నర్ వ్యూహాన్ని చెత్తబుట్టలో పారేసింది. ఇప్పటివరకు బీఆర్ఎస్ పట్ల ప్రదర్శిస్తూ వచ్చిన వ్యూహాత్మక నిశ్శబ్దాన్ని బద్దలు కొట్టాలని ఢిల్లీ బాసులు డిసైడ్ అయ్యారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన చారిత్రాత్మక విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్న కమలదళం.. తన నెక్స్ట్ మెయిన్ టార్గెట్‌గా తెలంగాణను ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. బెంగాల్ తరహాలోనే ఇక్కడ కూడా ప్రత్యర్థులను తుడిచిపెట్టే అగ్రెసివ్ పాలిటిక్స్‌కు తెరలేపింది. బీఆర్ఎస్ వేసిన రివర్స్ గేర్ కమలనాథులను మరింత రెచ్చగొట్టడంతో.. ఇక గులాబీ పార్టీని క్షేత్రస్థాయిలో నామరూపాలు లేకుండా చేయడమే ఏకైక ఎజెండాగా బీజేపీ తన అసలైన రాజకీయ వేట ప్రారంభించబోతున్నట్టు సమాచారం. బండి భగీరథ్ పోక్సో కేసు సెగలు కాస్త చల్లబడటమే ఆలస్యం.. బీఆర్ఎస్ పై బీజేపీ ప్లాన్ అమలు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.మొత్తానికి బండి భగీరథ కేసు కేవలం ఒక వ్యక్తిగత వివాదంగా మిగిలిపోలేదు. తెలంగాణ భవిష్యత్తు పొత్తుల పటాన్ని, పొలిటికల్ రూట్ మ్యాప్‌ను మార్చేసిన ఒక బిగ్గెస్ట్ టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. ఇకపై ఎలాంటి లోపాయికారీ పొత్తులకు ఛాన్స్ ఉండకపోవచ్చు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒంటరిగానే రణరంగంలోకి దూకడం పక్కాగా కనిపిస్తోంది.

## విదేశీ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలి

-మొదటిపేజీ తరువాయి

సంప్రదింపులు జరిపి పలు కీలక సిఫార్సులు చేసిందని వివరించారు. కార్మికులు సంతృప్తిగా ఉన్నప్పుడే ఉత్పత్తి బాగుంటుందన్నారు. అన్‌స్కిల్, సెమీ స్కిల్, హైస్కిల్ కేటగిరీలుగా విభజించిందన్నారు. కార్మికుల వేతనాలు నిర్ణయించేందుకు గాను జోన్లను 3 జోన్లుగా విభజించామని తెలిపారు. జోన్-1లో మున్సిపల్ కార్పొరేషన్లు. జోన్-2 మున్సిపాల్టీలు. జోన్-3 కింద గ్రామీణ ప్రాంతాలు ఉంటాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. జోన్-1లో అన్‌స్కిల్డ్ కార్మికుల వేతనంను రూ.12,750 నుంచి రూ.16వేలకు, సెమీ స్కిల్డ్ కార్మికుల వేతనం రూ. 13,592 నుంచి రూ.17వేలకు, స్కిల్డ్ కార్మికుల వేతనం రూ.రూ.13,772 నుంచి రూ.18,500కి, హై స్కిల్డ్ కార్మికులకు సంబంధించి రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచామని వెల్లడించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం జూన్? నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తుందని చెప్పారు.

**విదేశీ ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలి**

స్కిల్స్ పెంచుకునేందుకు అవసరమైన ప్రోత్సాహకాలను ఇస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నైపుణ్యాలు పెంచుకుంటేనే విదేశాల్లో రూ.2లక్షల వరకు వేతనం ఉంటుందని వివరించారు. ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించలేని చదువులు వ్యర్థమని ఆయన అభిప్రాయపడ్డారు. జర్మనీ, జపాన్, సింగపూర్‌లలో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, రాష్ట్ర యువత స్కిల్స్ పెంచుకొని విదేశీ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల వైట్‌కాలర్ ఉద్యోగాలకే ముప్పు అని బ్లూ కాలర్ ఉద్యోగాలకు ఉండదన్నారు. నైపుణ్యాలు ఉన్న వారు కావాలని విదేశాలు తమను సంప్రదిస్తున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు.

“ఏఐతో కోట్లాది ఉద్యోగాలకు ముప్పు వస్తోంది. జర్మనీ, జపాన్, సింగపూర్‌లో ఎన్నో ఉద్యోగాలు ఉన్నాయి. రాష్ట్ర యువత స్కిల్స్ పెంచుకొని విదేశీ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలి. ఏఐ వచ్చినా బ్లూకాలర్ ఉద్యోగాలకు ముప్పు ఉండదు. నైపుణ్యాలు ఉన్నవారు కావాలని విదేశాలు మమ్మల్ని సంప్రదిస్తున్నాయి. స్కిల్స్ పెంచుకునేందుకు అవసరమైన ప్రోత్సాహకాలను ఇస్తున్నాం. ఏఐ వచ్చినా బ్లూకాలర్ ఉద్యోగాలకు ముప్పు ఉండదు. నైపుణ్యాలు పెంచుకుంటే విదేశాల్లో రూ.2 లక్షల వరకు వేతనం ఉంటుంది. నైపుణ్యాలు పెంచేందుకు ఏటీసీ విద్యార్థులకు నెలకు రూ.2 వేలు ఇస్తున్నాం”

గత ప్రభుత్వ హయాంలో హయాంలో కనీస వేతన సవరణ చేయలేదు : బీఆర్ఎస్ హయాంలో కనీస వేతన సవరణ చేయలేదని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. కార్మికులు సంతృప్తిగా ఉన్నపుడు మాత్రమే ఉత్పత్తి బాగుంటుందని అభిప్రాయపడ్డారు. వేతనాల సవరణకు సీఎం రేవంత్ రెడ్డి ఒక కేబినెట్ సబ్? కమిటీని ఏర్పాటు చేశారని వివరించారు. కనీస వేతన సవరణ ప్రభావం 1.11 కోట్ల మందిపై ఉంటుందని తెలిపారు.

**బండి భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు**

వాహనాలు తనిఖీ చేస్తుండగా బండి భగీరథ్‌ను అరెస్టు చేశామని పోలీసులు చెప్పారు. పోలీసులు చెప్పిందే నమ్ముతా. బండి సంజయ్ అప్పగిస్తే... ఇంటికి పోలీసులను పిలిచి అప్పగించాల్సి ఉండేది. అప్పా జంక్షన్ వద్ద భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అప్పా జంక్షన్ ఏమైనా బండి సంజయ్ ఇల్లా? రోడ్డు మధ్యలో భగీరథ్‌ను అదుపులోకి తీసుకుంటే సరెండర్ ఎలా అవుతుంది. నేను పోలీసుల మాట నమ్మాలా?.. నేతల మాటలు నమ్మాలా? ఫిర్యాదు అందిన వెంటనే పద్ధతి ప్రకారం చర్యలు తీసుకున్నాం. బీఆర్ఎస్ నేతలు సిగ్గు తప్పి వ్యవహరిస్తున్నారు. వారే విచారించి.. వాళ్లే తీర్పు ఇచ్చేస్తున్నారు. పోక్సో కేసులో మైనర్ వివరాలు వెల్లడిస్తే.. వాళ్లకు ఎంతో ఇబ్బంది. బాలిక విషయంలో రాజకీయాలు చేయటం ఎందుకు? కేటీఆర్ కావాలంటే.. రాజకీయంగా కొట్లాడాలి” అని సీఎం అన్నారు

## మందుబాబులకు బ్యాడ్‌న్యూస్..

-మొదటిపేజీ తరువాయి



ఎక్కువ వ్యయం అవుతుందని, ధరలను పెంచాలని ప్రభుత్వానికి కంపెనీలు ఎప్పటినుంచో వినతులు అందిస్తున్నాయి. పెంచకపోతే తమకు ఆర్థిక భారం అవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావంతో సీసాల ధరలు పెరిగాయి. అంతేకాకుండా కమర్షియల్ గ్యాస్ ధరలు పెరగడంతో తయారీ ఖర్చు 15 నుంచి 20 శాతం వరకు పెరిగిందని కంపెనీలు చెబుతున్నాయి. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు వెయ్యికిపైగా పెరిగాయి. దీంతో కంపెనీల ఒత్తిడి, కమిటీ సిఫార్సుల మేరకు మద్యం ధరల పెంపునకు రేవంత్ సర్కార్ మొగ్గు చూపింది.

**పెరగనున్న అన్ని బ్రాండ్ల ధరలు**

సాధారణ, మీడియం బ్రాండ్లతో పాటు ప్రీమియం ధరల బ్రాండ్ల ధరలను కూడా పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. దీంతో పెంపు వల్ల ప్రభుత్వ ఖజానాకు కూడా ఆదాయం పెరగనుంది. అయితే మద్యం ధరలకు సంబంధించి గతంలో రేవంత్ సర్కార్ ఒక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ ఇతర రాష్ట్రాల్లోని మద్యం ధరలు, ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను అంచనా వేసింది. దీని ఆధారంగా 25 నుంచి 30 శాతం వరకు పెంచాలని ప్రభుత్వానికి నివేదికలు ఇటీవల అందించింది. అయితే అంత మొత్తంలో పెంచితే మందుబాబుల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశముంటుంది. దీంతో 15 శాతం వరకు పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కాగా రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు మద్యం ధరలు పెంచలేదు. ఇప్పుడు తొలిసారి ధరలను పెంచేందుకు రెడీ అవుతోంది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలో మద్యం ధరలు తక్కువగా ఉన్నాయి.

## కుల సమూహంలో నష్టపోయేది మహిళలే..



-మొదటిపేజీ తరువాయి

మీనాక్షి నటరాజన్ విమర్శించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడిపై ఫిర్యాదు నమోదవడంతో పలు ప్రశ్నలు ఎదురవుతున్నాయని తెలిపారు. కులాల ప్రకారం మహిళలను అణగదొక్కే పితృస్వామ్య వ్యవస్థ మరోసారి వెలుగులోకి వచ్చిందని ప్రస్తావించారు. కుల సమూహంలో నష్టపోయేది మహిళలేనని పెరియార్ వ్యాఖ్యలను గుర్తు చేశారు. బాలికల దుస్తులు, పెంపకంపై విమర్శలు చేయడం దారుణమని ధ్వజమెత్తారు. పితృస్వామ్య సమాజంలో అబ్బాయిల హింసాత్మక ప్రవర్తనను సాధారణంగా చూస్తున్నారని అన్నారు.

**కాంగ్రెస్‌లో తిరోగమన ఆలోచనలకు స్థానం లేదు..**

కాంగ్రెస్‌లో తిరోగమన ఆలోచనలకు స్థానం లేదని మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు. నీతి సూత్రాలు మాట్లాడేవారు ఇలాంటి వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు. వ్యక్తులపై నిందలు కాదని.. పితృస్వామ్యంపై పోరాటమే అవసరమని వ్యాఖ్యానించారు. రాజకీయ పార్టీల్లో  ఏర్పాటు చేయాలని సూచించారు. సామాజిక న్యాయం తర్వాత ఇప్పుడు లింగ న్యాయం కోసం కూడా పోరాడాలని చెప్పుకొచ్చారు. లింగ న్యాయం వర్ధిల్లాలని మీనాక్షి నటరాజన్ ఆకాంక్షించారు.

# సంపాదకీయం

## ఢిల్లీ శత్రువులు.. గల్లీ దోస్తులు!

దేశవ్యాప్తంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. తెలంగాణలో మాత్రం అందుకు భిన్నమైన రాజకీయ వాతావరణం నెలకొని ఉన్నది. గత రెండున్నరేండ్లుగా వరుస రాజకీయ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రయోజనాల కోసం, న్యాయమైన వాటా కోసం ఏనాడూ ప్రధాని నరేంద్రమోదీని నిలదీసి ఉద్యమించలేదు.. అదే దారిలో తెలంగాణ బీజేపీ అగ్రనాయకత్వం కాంగ్రెస్ వాగ్దానాల వైఫల్యాలపై చెప్పుకోదగ్గ కార్యక్రమం ఒక్కటీ చేపట్టలేదు. ఇటీవల తెలంగాణలో పర్యటించిన మోదీ ఒక అధికారిక సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి కలిసి నడుద్దాం రా! అని ఆహ్వానించడం దేశవ్యాప్త సంచలనానికి కారణమైంది. తెలంగాణ సమాచారం బీజేపీ, కాంగ్రెస్‌లోని రేవంత్ వర్గం ఒక్కటై పోతారన్న చర్చలు, ఊహగానాలు ఊపందుకున్నాయి. బీఆర్‌ఎస్ ఎంతోకాలంగా ఆరోపిస్తున్న బీజేపీ, కాంగ్రెస్ ఫెవికాల్ బంధం బండి భగీరథ్ ఉదంతంలో మరింత గట్టి పడిందన్న సంకేతాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో రాహుల్ సహా కాంగ్రెస్ సీనియర్ నేతలు ఏం చేయబోతున్నారన్నది ఉత్కంఠగా మారింది. ఒకప్పుడు బీజేపీలో నాయకత్వ స్థాయికి ఎదగాలన్నా, ఒక పదవి పొందాలన్నా ప్రవేశ ద్వారం ఒక్కటే, అది ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్ పరివార్ నేపథ్యం. శ్యామప్రసాద్ ముఖర్జీ నుంచి వాజపేయి, అద్వానీ తరం వరకు ఆరు దశాబ్దాలుగా అదే పద్ధతి కొనసాగింది. 1990లో తొలిసారిగా బీజేపీ ప్రభుత్వాలు ఏర్పాటైన మధ్యప్రదేశ్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రులు వరుసగా సుందర్‌లాల్ పట్వా, భైరాన్ సింగ్ షెకావత్, శాంతకుమార్ కరడుగట్టిన సంఘ్ పరివార్ నేతలు. కానీ 2014లో బీజేపీలో మోదీ, షా శకం ఆరంభమయ్యాక ఆ పార్టీ తీరు మారిపోయింది. సిద్ధాంతం కంటే అధికారమే పరమావధిగా వికృత రూపం దాల్చింది. ఇతర పార్టీల నుంచి వచ్చిచేరిన వారు అనతి కాలంలోనే కేంద్ర మంత్రులుగా, ముఖ్యమంత్రులుగా పదవులందుకునే వైకుంఠపాళీ నిచ్చెనలు అందుబాటులోకి వచ్చాయి. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హిమంతబిశ్వశర్మ (అసోం), సువేందు అధికారి (బెంగాల్), సామ్రాట్ చౌదరి (బిహార్), పెమాఖండు (అరుణాచల్‌ప్రదేశ్), బీరేన్‌సింగ్ (మణిపూర్), మాణిక్ షా (త్రిపుర) ఇతర పార్టీల నుంచి ఇలా వచ్చి అలా అందలమెక్కిన వారే. ఇక 12 ఏండ్లుగా మోదీ క్యాబినెట్‌లో కొలువు తీరిన వారి సంఖ్య ఇంకా పెద్దది. ఎంపీలు, ఎమ్మెల్యేలకైతే లెక్కే లేదు. దశాబ్దాలుగా బీజేపీతో కలిసి నడిచిన నేతలెందరో తెరమరుగయ్యారు. సుదీర్ఘకాలం మిత్రపక్షాలుగా ఉన్న అకాలీదళ్, శివసేన వంటి ప్రాంతీయ పార్టీలు బీజేపీకి దూరమయ్యాయి. మౌలికంగా సిద్ధాంతపరంగా భావ సారూప్యం లేని పార్టీలు, గతంలో తీవ్రంగా వ్యతిరేకించిన పార్టీలు దగ్గరైపోయాయి. ఇప్పుడు బీజేపీ కాషాయం, కాంగ్రెస్ వెర్షన్‌గా మారిపోయింది. అందుకనే రేవంత్‌ను మోదీ సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహార శైలి మొదటినుంచి సందేహాస్పదంగానే ఉన్నది. ఆయన కట్టర్ తెలంగాణ ఉద్యమకారుడు కాదు, కట్టర్ కాంగ్రెస్ వాదీ కాదు. రాజకీయ సిద్ధాంతాల పట్ల ఒక సుదీర్ఘనిబద్ధత లేదు. కాలం కలిసి వచ్చి ముఖ్యమంత్రి అయ్యారు. కానీ పూర్వాశ్రమ సహవాస ప్రభావాలు తొలగిపోలేదు. ఆయన మాటల్లో చేతల్లో బీజేపీ, తెలుగుదేశం పార్టీల పట్ల అపారమైన ప్రేమాభిమానాలు తరచుగా వ్యక్తమవుతూ ఉంటాయి. రేవంత్‌రెడ్డి మరో హిమంతబిశ్వశర్మ, సువేందు అధికారి కావొచ్చని అంటూ ఎంపీ ధర్మపురి అరవింద్ సున్నితంగా విమర్శించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా ఒక సందర్భంలో తెర వెనుక కుట్రలు జరుగుతున్నాయని, తోటి మంత్రులతో జాగ్రత్త సుమా అని రేవంత్‌ను మిత్ర సమ్మితంగా హెచ్చరించారు. ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీలోని లుకలుకలకు తెలంగాణ బీజేపీ నాయకుల్లో ఆందోళన ఎందుకో అర్థం కాదు. ఇటీవల పరిణామాల నేపథ్యంలో బండి సంజయ్ రాజీనామా చేయాలంటూ సమాజం అంటుంటే కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి వ్యతిరేకించడం వింతగా ఉన్నది. ఆ మధ్య మోదీతో కలిసి ఓ సమావేశంలో పాల్గొన్నప్పుడు తన పాఠశాల బీజేపీ, కళాశాల టీడీపీ, ఉద్యోగం రాహుల్ గాంధీ వద్ద అని రేవంత్‌రెడ్డి చెప్పుకొన్నారు. ఖమ్మం జిల్లా పర్యటనలో ఏర్పాటైన ఒక సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని కేసీఆర్ దెబ్బతీశారని ఆక్రోశించారు. అందుకే ఎన్టీఆర్ అభిమానులు, చంద్రబాబు పార్టీ శ్రేణులు బీఆర్‌ఎస్ జెండా గద్దెలను కూల్చాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌కు బద్ధశత్రువులైన పార్టీల పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రదర్శిస్తున్న సానుకూల వైఖరి కట్టర్ కాంగ్రెస్ నేతలకు మింగుడు పడడంలేదు. అలాగని అడుగు ముందుకు వేయలేని నిస్సహాయ స్థితి. కాంగ్రెస్ పార్టీ నడవడానికి భారీ స్థాయిలో ఇంధనాన్ని సమకూరుస్తున్న రేవంత్‌రెడ్డిని రాహుల్ మాత్రం కట్టడి చేయగలరా? లేకపోతే చరిత్రలో ఏ కాంగ్రెస్ ముఖ్యమంత్రి అయినా వచ్చే ఐదేండ్లు, పదేండ్లు తమపార్టీ ప్రభుత్వమే వస్తుంది అని అన్నారే తప్ప, తానే ముఖ్యమంత్రిని అని చెప్పుకోలేదు. రేవంత్‌రెడ్డి మాత్రం పార్టీ పేరు ప్రస్తావించకుండా 2034 వరకు ముఖ్యమంత్రిగా ఉంటానని చెప్పుకొన్నారు. అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యమన్న మాట ఆయన నోట నుంచి రాలేదు. ఆ మాటల వెనక దాగి ఉన్న గూఢార్థం బోధపడక కాంగ్రెస్ అధిష్ఠానం కలవర పడుతున్నది. రేవంత్‌రెడ్డిని స్వాగతించిన మోదీ వెనువెంటనే చంద్రబాబుతో ఏకాంతంగా గంటసేపు చర్చించడం, పవన్‌కల్యాణ్‌ను పరామర్శించడం, బీజేపీ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను పక్కన పెట్టి, పొదుపు హితోపదేశాలు చేయడం, పోలీసులు తొలుత బండి భగీరథ్‌పై పోక్సో చట్టంలోని సాధారణ సెక్షన్లను నమోదు చేయటం వంటి వరుస ఘటనలు తెర వెనుక ఏదో రాజకీయం జరుగుతున్నదన్న అనుమానాలకు ఆస్కారం కలిగించాయి. తెలంగాణ బీజేపీ నేతలతో సమావేశం కాకుండా ప్రోటోకాల్ పక్కనపెట్టి అంత సమయం ఇచ్చి చంద్రబాబుతో, పవన్ కల్యాణ్‌తో ప్రత్యేకంగా హైదరాబాదులోనే ప్రధాని ఎందుకు కలిసినట్టు? మిత్రపక్షాలుగా వారు తరచుగా కలుస్తూనే ఉన్నారు కదా. చంద్రబాబు ఇంట్లో ప్రత్యేకమైన సందర్భం ఏమైనా ఉన్నదా అంటే అదీ లేదు. పవన్ కల్యాణ్ చేయించుకున్న ఆపరేషన్ చాలా చిన్నదని డాక్టర్లే అంటున్నారు. అయినా వారిద్దరి కార్యస్థానం ఆంధ్రప్రదేశ్ కదా, అమరావతి కదా. ఇక్కడే ఎందుకు? బీజేపీ, టీడీపీ వైపు మోహరించిన మీడియా, సోషల్ మీడియా తెలంగాణలోనే కాదు, ఆంధ్రప్రదేశ్‌లో కూడా రేవంత్‌రెడ్డిపై ఈగ వాలనీయడం లేదు. ఇటు రేవంత్‌రెడ్డి కూడా బీజేపీ, టీడీపీకి సహకరిస్తున్నారు. బండి భగీరథ ఉదంతమే ఒక తార్కాణం. బీఆర్‌ఎస్ మీద బురద చల్లడానికి తాటికాయంత అక్షరాలతో వార్తలు రాసే పత్రికలు, బ్రేకింగ్ వార్తలు, చర్చలు అంటూ నానా యాగీ చేసే ప్రసార మాధ్యమాలు, నాలుగు రోజులపాటు చూసీ చూడనట్టు వ్యవహరించాయి. మరోవైపు తెలంగాణ పోలీసులు బాధితురాలి ఫిర్యాదు అందాక గంటలకొద్దీ కాలయాపన చేసి, పోక్సో చట్టంలోని సాధారణ సెక్షన్లను నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. మరో వైపు కరీంనగర్‌లో భగీరథ్ హనీట్రాప్ ఫిర్యాదు ఆగమేఘాల మీద తీసుకోవడం విశేషం. దీన్నిబట్టి తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ మైత్రీ బంధం ఎంత పటిష్టంగా ఉన్నదో ప్రపంచానికి అవగతమైంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా, విభజన హామీలు, నీటి వాటాలు, రాష్ట్రానికి అదనంగా రావాల్సిన ప్రోత్సాహకాల గురించి కేంద్రాన్ని నిలదీయాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అధికారంలో లేని బీఆర్‌ఎస్‌ను టార్గెట్‌గా చేసుకొని అదే పనిగా మాట్లాడడం వెనుక సొంత ఎజెండా దాగి ఉన్నదేమో! గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాల వైఫల్యాలు, ప్రజల సమస్యలపై పోరాడవలసిన బీజేపీ కూడా కేంద్రం పెద్దల జోక్యంతో దిశ మార్చుకొని బీఆర్‌ఎస్‌ను ప్రధాన శత్రువుగా పరిగణిస్తున్నది. బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా బీజేపీ, కాంగ్రెస్ అంతర్గతంగా ఒక్కటై తలపడుతున్నాయి. అందుకే మోదీ ఆఫర్‌ను రేవంత్ తిరస్కరించలేదు సరి కదా, అది తన గొప్పగా చెప్పుకున్నారు. మోదీ తొలిసారి ప్రధాని అయ్యాక రెండేండ్లకే 60 మంది శాసనసభ్యులున్న అరుణాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యమంత్రి పెమాఖండు, 32 మంది శాసనసభ్యులతో ఫిరాయించి కాషాయం కండువా కప్పుకొని బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.

# ధాన్యలక్ష్మి చెంతనే దయనీయమా?



తెలంగాణ ఉద్యమం, కేసీఆర్ దూరదృష్టి ఫలితం..కాళేశ్వరం, మిషన్ కాకతీయ అందించిన జలాల కారణంగా రాష్ట్రం కోటిన్నర ఎకరాల మాగాణిగా మారింది. వరి సమృద్ధిగా పండుతున్నది. భారత ఆహార సంస్థ గోదాముల్లో నిల్వ ఉండేది అత్యధికంగా తెలంగాణ ధాన్యం, బియ్యమే. మరి రైతుల ముఖాల్లో సంతోషం కనిపించడం లేదేం? కారణం..వారు ఎదుర్కొంటున్న సమస్య ఏమిటో కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించకపోవటం, ఆ దిశగా కనీస ఆలోచన చేయకపోవటం. రైతులు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్య మార్కెటింగ్. దానిని ఎలా ఎదుర్కోవాలి? వారి చేతిలో నాలుగు పైసలు ఉండేలా ఏమి చేయాలి అనేదానిపై ప్రభుత్వం వద్ద ఇప్పటికీ సరైన ప్రణాళిక లేదు. వరి ఉత్పత్తికి సంబంధించి తెలంగాణకు రెండు ప్రత్యేకతలు ఉన్నాయి. సగటు దిగుబడి అధికంగా ఉండటం ఒక ప్రత్యేకత అయితే, మేలు రకమైన సన్నధాన్యాన్ని పండించటం మరో ప్రత్యేకత. ఈ అవకాశాలను ఉపయోగించుకోవటానికి ప్రస్తుత పాలకుల వద్ద నిర్దిష్టమైన ప్రణాళిక లేకపోవటమే రైతుల పాలిట శాపంలా మారింది. రాష్ట్రంలో చాలాచోట్ల ఈ వేసంగిలో వరితో పాటు, మక్కలు కూడా గణనీయంగా పండాయి. ఎక్కడ ఎండబెట్టాలో, ఎక్కడ నిల్వ చేయాలో రైతులకు తెలియటం లేదు. వీటికి తోడు ప్రకృతి వైపరీత్యాలు. మే నెల అంటేనే తెలంగాణకు గుండె దడ. వడగండ్ల వానలు ఎప్పుడు కురుస్తాయో తెలియదు. మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలకు వడ్లు తీసుకెళ్లి అమ్ముకోవటం పెద్ద యాతన. వడదెబ్బకు గురై యార్డుల్లోనే రైతులు మరణించిన సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తగినన్ని గోనె సంచులు, లారీలు లేకపోవటం, హమాలీల కొరత, మద్దతు ధర లభించకపోవటం, సకాలంలో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ కాకపోవటం వంటి సమస్యలు ఈ ఏడాదీ తప్పలేదు. హమాలీల కొరత ఏర్పడితే కేసీఆర్ హయాంలో బిహార్ నుంచి కూలీలను తెప్పించారు. పశ్చిమబెంగాల్ జూట్‌మిల్లుల నుంచి గోనె సంచులు వచ్చాయి. ఇప్పుడు అ లాంటి పరిస్థితి ఏదీ? మేలు రకానికి చెందిన సన్నబియ్యాన్ని అంతర్జాతీయ మార్కెట్లో విక్రయించటం, విదేశాలకు ఎగుమతి చేయటం వంటి ప్రయత్నాలు కేసీఆర్ హయాంలో ప్రారంభం కాగా, అవన్నీ ఇపుడు నిలిచిపోయాయి. తెలంగాణ బ్రాండ్‌తో నాణ్యమైన బియ్యం విదేశాలకు ఎగుమతి అయితే రైతులకు మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా ప్రస్తుత పాలకులు ఆ మార్గాన్ని ఎంచుకోవటం లేదు. ఎంతోమంది రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి, అక్రమంగా విదేశాలకు తరలిస్తుండగా, నాణ్యమైన సన్నబియ్యా న్ని దర్జాగా ఎగుమతి చేయటానికి ఉన్న అడ్డంకులు ఏమిటో అర్థం కావు. రేషన్‌షాపుల్లో తెల్లకార్డులు లేని వారికి కూడా తెలంగాణ బ్రాండ్ పేరుతో సన్నబియ్యం విక్రయిస్తామని గొప్పలు చెప్పినా కార్యరూపం దాల్చలేదు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగానికి సంబంధించిన కొన్ని అధ్యయనాలు, గణాంకాలను ప్రస్తావించుకోవాల్సిన అవసరం ఉన్నది. 2023-24లో తెలంగాణలో 168.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరిగింది. దేశ ఉత్పత్తిలో ఇది 12.50 శాతం కావటం విశేషం. వరి ఉత్పత్తిలో దేశంలోనే నెంబర్‌వన్ స్థానానికి చేరింది. 2019-20 ఆర్థిక సంవత్సరం, 2020-21 ఆర్థిక సంవత్సరాలను పోల్చినప్పుడు వరి సాగు విస్తీర్ణం ఏకంగా 29.9'% మేర పెరిగింది. రబీలో వరి సాగు అధికం కావటమే ఇందుకు కారణం. ఈ పుణ్యం కాళేశ్వరం ప్రాజెక్టుదేనని అధ్యయనాల్లో తేలింది. రైతుల శ్రమ కూడా తక్కువేమీ కాదు. రైతుల సగటు సాంకేతిక సామర్థ్యం (మీన్ టెక్నికల్ ఎఫీషియన్సీ) 0.860 అని లెక్కించారు. దేశంలోనే ఇది అత్యధికం. ప్రణాళిక, ప్రోత్సాహం ఉండాలే గానీ మయన్మార్ నుంచి మినుములు, గాంబియా నుంచి కందులు దిగుమతి చేసుకోవాల్సిన అవసరమే ఉండదు. వాటన్నింటినీ తెలంగాణలో పుష్కలంగా పండించవచ్చు. వ్యవసాయం, విద్యుత్తు, నీటిపారుదల, రెవెన్యూ, బ్యాంకింగ్, పౌరసరఫరా శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలి. ఈ గొలుసుకట్టులో ఎక్కడ లోపం ఉన్నా రైతులకు కష్టమే. కొనుగోలు కేంద్రాల వద్ద కన్నీరు పెట్టుకోవాల్సిన దుస్థితి రైతులది. కొన్నిచోట్ల మహిళలు కూడా సాహసించి పంటలు పండిస్తున్నారు. ధాన్యం లోడింగ్ దగ్గర నుంచి ప్రతీది వారికి సమస్యే. దేనినీ సొంతంగా చేసుకోలేరు. అలాంటప్పుడు లోడింగ్, అన్‌లోడింగ్‌లకే రోజుల సమయం పడుతున్నది. అందుకే వ్యవసాయం అంటేనే విరక్తి చెందుతున్నారు. పంట చేతికి అందటానికి నాలుగైదు నెలల సమయం ఎలా పడుతుందో, రవాణా, గోనెసంచులు, గోదాముల వంటి ఏర్పాట్లు చేసుకోవటానికి కూడా అంతే సమయం పడుతుంది. వ్యవసాయ శాఖ అటువైపు ఏర్పాట్లు చేసుకుంటే, పౌరసరఫరాల శాఖ ఇటువైపు ప్రయత్నాలు ప్రారంభించాలి. అలా చేయకపోవడం వల్లనే...'పంట విపరీతంగా పండింది, అందువల్లే గోనెసంచులు ఏర్పాటు చేయలేకపోయాం', 'లారీలు దొరకకపోతే ట్రాక్టర్లు ఉపయోగించాలని ఆదేశాలు ఇచ్చాం', 'వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్లు ఇస్తాం', 'తాలు పేరుతో క్వింటాకు 6 కిలోలు కట్ చేస్తే మిల్లర్లపై కేసులు పెడతాం' అనే ప్రకటనలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు తర్వాత వస్తున్నాయి. రైతుబీమా, రైతుబంధు వంటి పథకాలతో దేశానికే దిశానిర్దేశం చేసిన రాష్ట్రం మార్కెటింగ్‌లోనూ మార్గదర్శకంగా నిలవాలి. ఇన్ని సమస్యలు చుట్టుముట్టినప్పుడు వాటిని పట్టించుకోకుండా రైతు వారోత్సవాల పేరుతో ప్రభుత్వం హడావుడి చేయడం ఎవరికోసమన్నదే జవాబు లేని ప్రశ్న.

# వీధి కుక్కలపై సంచలన తీర్పు

కొన్ని కొన్ని ఘటనలు సుదూర పర్యవసానాలకు దారితీసే నిర్ణయాలకు కారణమవుతాయి. నిరుడు దేశ రాజధాని ఢిల్లీలో వీధికుక్కల దాడికి గురై ఓ చిన్నారి చనిపోయిన ఘటన అలాంటిదే. ఆ విషాద ఘటనపై టైమ్స్ ఆఫ్ ఇండియా 'సిటీ హౌండెడ్ బై స్ట్రేస్, కిడ్స్ పే ప్రైస్' (నగరంలో వీధికుక్కల స్వైరవిహారం, మూల్యం చెల్లిస్తున్న చిన్నారులు) అనే శీర్షికతో ప్రచురించిన ఓ కథనం ఎంతోమందిని కదిలించింది. అందులో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కూడా ఉన్నారు. 2025 జూలై 28న ప్రచురితమైన ఆ కథనంతో చలించిన జస్టిస్ పార్థీవాలా, జస్టిస్ మహదేవన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం వీధిశునకాల సమస్య పరిష్కారానికి సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. ఈ చొరవ సుదీర్ఘకాలంగా దేశం ఎదుర్కొంటున్న వీధి శునకాల సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనే దిశగా అడుగులు వేయటం గమనార్హం. మంగళవారం నాటి సంచలన తీర్పుతో ఈ ప్రయాస ఓ కొలిక్కి వచ్చిందని చెప్పవచ్చు. వీధికుక్కలను స్టెరిలైజ్ చేసి, షెల్టర్లకు తరలించాలనే విషయమై ఎలాంటి రాజీ కుదరదని స్పష్టం చేసిన ధర్మాసనం ఇదివరకటి తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన అప్పీళ్లన్నింటినీ కొట్టివేసింది. సర్వోన్నత న్యాయస్థానం తుదితీర్పులో పలు అంశాలపై స్పష్టతనిచ్చింది. 2001లో ప్రవేశపెట్టిన నియంత్రణ చట్టాన్ని ఏండ్ల తరబడి అరకొరగా అమలు చేయటం వల్ల వీధికుక్కల సమ స్య పరాకాష్ఠకు చేరుకున్నదని, ఇందుకు మౌలిక వసతులు కల్పించి, యంత్రాంగాన్ని పటిష్టపరచకపోవడమే కారణమని మండిపడింది. దీనికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యత అని ఎత్తిచూపింది. జంతు హక్కుల కన్నా ప్రజాభద్రత, మానవ జీవితానికే ప్రాముఖ్యం ఇవ్వక తప్పదన్నది అందులో కీలకమైనది. రాజ్యాంగం 21వ అధికరణంలో పొందుపర్చిన జీవించే హక్కులో బహిరంగ ప్రదేశాల్లో కుక్కల భయం లేకుండా సంచరించడమూ ఉంటుందని నొక్కిచెప్పింది. 2025 నవంబర్ 7న జారీ చేసిన ఆదేశాలను సవరించే ప్రసక్తే లేదని నొక్కిచెప్తూ మూడు అంశాలకు సంబంధించి విస్తృతంగా వివరణలు ఇచ్చింది. అందులో మొదటిది, దవాఖానలు, విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వంటి పబ్లిక్ స్థలాల నుంచి సేకరించిన వీధికుక్కలను స్టెరిలైజ్ చేసిన తర్వాత షెల్టర్లకు పంపాలి తప్ప, మళ్లీ అవే ప్రదేశాల్లో వాటిని విడిచిపెట్టటం కుదరదు. రెండు, రేబిస్ సోకిన, నయంకాని వ్యాధులతో బాధపడే లేదా ప్రమాదకరమైన రీతిలో దాడులకు తెగబడే కుక్కలకు మానవీయమైన రీతిలో కారుణ్య మరణాన్ని ప్రసాదించాలి. అందుకు జంతువుల కుటుంబ నియంత్రణ (ఏబీసీ) నిబంధనలు, జీవకారుణ్య చట్టం నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలి. మూడు, బహిరంగంగా వీధుల్లో కుక్కలకు తిండిపెట్టడం పూర్తిగా నిషేధం. అందుకు బదులుగా మునిసిపల్ అధికారులు కుక్కల కోసం ప్రత్యేక ఫీడింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి నిర్వహించాల్సి ఉంటుందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. కోర్టు తన ఆదేశాల అమలుపై ప్రత్యేకించి కఠినమైన సూచనలు చేయటం గమనార్హం. కుక్కల స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కేంద్రాలను మొక్కుబడిగా ఏర్పాటు చేయటం ఇక ఎంతమాత్రం కుదరదు. జిల్లాకు ఒక్కటైనా పూర్తిస్థాయి కేంద్రం ఉండాల్సిందే. 5 వేల కుక్కలు ఒకేచోట ఉండేలా షెల్టర్లు నిర్మించాలని, దీనిపై 8 వారాల్లోగా నివేదిక సమర్పించాలని స్పష్టం చేయటమే అందుకు ఉదాహరణ. సాధారణంగా కోర్టు ఆదేశాల అమలు అంటే ధిక్కరణ చర్యల భయం మెడమీద కత్తిలా వేలాడుతుంటుంది. అయితే కోర్టు ఆదేశాలను సదుద్దేశాలతో విధులు నిర్వర్తించే అధికారులకు క్రిమినల్ చర్యల నుంచి రక్షణ కల్పించటం విశేషం. ఇది వారిలో అనవసరమైన భయాందోళనలను తగ్గిస్తుందని చెప్పవచ్చు. వీధికుక్కల సమస్యపై జారీచేసిన ఆదేశాల అమలు పర్యవేక్షణను హైకోర్టులకు అప్పగించటం మరో కీలక నిర్ణయం. ఇటీవలి చరిత్రలో న్యాయవ్యవస్థ ఇంతటి చొరవతో వ్యవహరించిన సమస్య మరొకటి లేదు. కోర్టు తీర్పును ఎలాంటి లోటుపాట్లు లేకుండా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగాలపై ఉన్నదని చెప్పక తప్పదు. వీధికుక్కల దాడిలో గాయపడి, ప్రాణాలు కోల్పోయిన చిన్నారుల కోసమైనా దృఢదీక్షతో నడుం బిగించక తప్పదు.

# 'కాకతీయ' పార్క్‌పై బీజేపీ అసత్య ప్రచారం

తెలంగాణ నేల నల్లరేగడి మట్టికి, నాణ్యమైన పత్తి సాగుకు దశాబ్దాల చరిత్ర ఉన్నది. ఒకప్పుడు వరంగల్ నగరం వస్త్ర పరిశ్రమకు నిలయంగా ఉండేది. 1934లో ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ స్థాపించిన ఆజంజాహి మిల్లు దాదాపు 10 వేల మందికి ఉపాధినిస్తూ దక్షిణ భారతదేశంలోనే వస్త్ర ఉత్పత్తికి కేంద్రంగా విరాజిల్లింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో జరిగిన నిరంతర నిర్లక్ష్యం వల్ల 1990లో ఈ మిల్లును మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల వేలాది మంది కార్మికులు జీవనోపాధిని కోల్పోయి, పొట్ట చేతపట్టుకొని సూరత్, భివాండి వంటి సుదూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వచ్చింది. తెలంగాణ మలిదశ ఉద్యమంలో వలస కార్మికులు కీలక పాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టును 1327 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. 2017 అక్టోబర్ 22న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు శంకుస్థాపన జరిగింది. తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన టీ-ట్యాప్ (తెలంగాణ టెక్స్‌టైల్ అండ్ అప్పరల్ పాలసీ-2017) ద్వారా మూలధనం, విద్యుత్తు రాయితీ, ఎస్‌జీఎస్ రీయింబర్స్‌మెంట్ వంటి అనేక ప్రోత్సాహకాలు అందించడం వల్ల అంతర్జాతీయ పెట్టుబడిదారులు వరంగల్ వైపు మొగ్గు చూపారు. ఈ పార్క్ ద్వారా దాదాపు రూ.11,586 పెట్టుబడి సామర్థ్యంతో దాదాపు 1.13 లక్షల మందికి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఏర్పాటయింది. ఇప్పటికే కిటెక్స్ (రూ.1,791.7 కోట్లు), యంగ్‌వన్ (రూ.1,131.6 కోట్లు), గణేశ ఎకోస్పియర్ (రూ.1,009 కోట్లు) వంటి 22 దేశీయ, అంతర్జాతీయ సంస్థలు భారీగా పెట్టుబడులు పెట్టాయి. తెలంగాణ టెక్స్‌టైల్ పాలసీ స్ఫూర్తితో కేంద్రం 2021లో ప్రధాన మంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ అప్పరల్-పీఎం మిత్రా) పథకాన్ని ప్రారంభించి, దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల నుంచి వచ్చిన 18 ప్రతిపాదనలతో ఏడింటిని ఎంపిక చేసింది. వాటిలో ఒకటి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్. తెలంగాణపై కేంద్రం పక్షపాత, వివక్ష ధోరణి చూపింది. పీఎం మిత్రా పథకం కింద ప్రాజెక్టులను గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ అని రెండుగా విభజించారు. గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టులకు రూ.500 కోట్లు, బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టుకు రూ.200 కోట్లు పీఎం మిత్రా పథకం కింద కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. కేఎంటీపీ 2017లోనే ప్రారంభమైనందున దీనిని బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టుగా పరిగణించి కేవలం రూ.200 కోట్ల సాయాన్ని మాత్రమే ప్రకటించారు. ఇందులో కూడా విడుదల చేసింది కేవలం రూ.30 కోట్లు మాత్రమే. పీఎం మిత్రా పథకానికి కొనసాగింపుగా టెక్స్‌టైల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్-టీసీడీపీ తీసుకువచ్చారు. టీసీడీపీ కింద గుజరాత్‌కు 13 ప్రాజెక్టులకు రూ.432 కోట్లు కేటాయించగా, తెలంగాణకు కేవలం 2 ప్రాజెక్టులకు గాను రూ.46 కోట్లు విదిల్చారు. కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను బీజేపీ ఖాతాలో వేసుకుంటూ, కేంద్ర ప్రభుత్వ చొరవగా తప్పుడు ప్రచారం చేస్తున్నది. ఏండ్ల క్రితమే ప్రారంభమ, కిటెక్స్ వంటి సంస్థలు ఇప్పటికే కార్యకలాపాలు సాగిస్తున్న ఈ పార్క్‌ను 2026లో మళ్లీ ప్రారంభించడానికి ప్రధాని మోదీ రావడంలో రాజకీయ ప్రయోజనాలు తప్ప అభివృద్ధి ఆలోచన కనిపించడంలేదు. కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి కేవలం ప్రచారంపై ఉన్న శ్రద్ధ క్షేత్రస్థాయిలో ఉన్న పత్తి రైతులపై లేకపోవడం ఆందోళనకరం. దేశంలో పత్తి దిగుమతులు 2019-20లో రూ.3,588 కోట్ల నుంచి 2024-25 నాటికి రూ.7,830 కోట్లకు భారీగా పెరిగాయి. విదేశాల నుంచి దిగుమతులను ప్రోత్సహిస్తున్న కేంద్రం, స్వదేశీ రైతుల నుంచి కనీసం 33 శాతం కూడా కొనుగోలు చేయడంలేదు. భారతీయ రైతుల నుంచి పత్తిని సేకరించడంలో కేంద్రం విఫలమవుతున్నది. ఫలితంగా రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నారు. కాకతీయ పార్క్ టెక్స్‌టైల్ అనేది తెలంగాణ రాష్ట్ర దార్శనికత, స్వయంకృషికి నిదర్శనం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ కష్టపడి నిర్మించిన పార్క్ ఇప్పటికే ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్నది. కానీ ఈ ప్రాజెక్టును కేంద్రం, బీజేపీ నేతలు తామే సాధించినట్టుగా చెప్పుకోవడం విడ్డూరం. ఢిల్లీ పెద్దల భజన మానుకొని, తెలంగాణకు రావాల్సిన నిధులను తీసుకురావడంపై తెలంగాణ బీజేపీ నేతలు దృష్టి పెట్టాలి. పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, దిగుమతులను తగ్గించినప్పుడే వస్త్ర రంగం నిజమైన అభివృద్ధి సాధిస్తుంది. కేవలం ప్రచారం కోసం చేసే ప్రారంభోత్సవాలు సరికాదు. ఇలాంటి ధోరణితో సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలుగుతుంది.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" రైతులకు ఖరీఫ్ సీజన్ అవగాహన కార్యక్రమం నంచర్ల రైతు వేదికలో

**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్:**

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని పరిశోధన ఫలితాలను క్షేత్రస్థాయిలో రైతులకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ పరిమల్ కుమార్ రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వానాకాలం ప్రారంభంలోనే రైతులకు అవగాహన కల్పించడంలో భాగంగా క్షేత్రస్థాయిలోని రైతులకు ఖరీఫ్ సీజన్‌లో అధిక దిగుబడులను ఇచ్చేటువంటి నూతన వంగడాలు, రకాలపై మరియు ఆరుతడి వరి సాగు చెయ్యడం వల్ల కలిగే ప్రయోజనాలను, పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను, సమగ్ర ఎరువుల నిర్వహణ గురించి వివరిస్తూ యూరియా వాడకం తగ్గించడం, మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాల గూర్చి, విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి, భూగర్భ జలాల పరిరక్షణ కోసం సాగు నీటి వినియోగం పై అవగాహన, పంటల మార్పిడి, సహజ వ్యవసాయం మరియు పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల గూర్చి విస్తృతంగా రైతులకు డాక్టర్ పరిమల్ కుమార్ అవగాహన కల్పించడం జరిగింది. రైతులు వరి గడ్డిని కాల్చడం వల్ల కలిగే నష్టాలను, లోతైన దుక్కి చెయ్యడం వలన కలిగే ప్రయోజనాన్ని రైతులకు తెలియజేసారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ సుంకిరెడ్డి గాయత్రి దేవి, మహమ్మదాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కె.యం. నారాయణ, పంచాయతీ సెక్రెటరీ శ్యామ్ నాయకులు భిక్షపతి,ఎండి ఈసా తిరుమల్ రెడ్డి, సాయి రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, బాల్ రెడ్డి, గాదిరాల్ డిప్యూటీ సర్పంచ్ హనుమంతు గౌడ్,మండల వ్యవసాయ అధికారి నరేందర్, వ్యవసాయ విస్తరణ అధికారి మౌనిక, రైతులు గాండ్ల పర్వతయ్య, బాలవర్ధన్ రెడ్డి, సూర్య, సి ఆంజనేయ, బి పాండు, బి హనుమంతు, జి అంజయ్య, బాల్ రెడ్డి, సిరాజ్, ఎం అంజి, ఎం కొండయ్య, తిరుపతయ్య, పాల్గొన్నారు.

# జూన్ 1 నుంచి కొత్త కనీస వేతనాలు

## రాష్ట్ర కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ఊరట

## 1.11 కోట్ల మందికి లబ్ధి.. 34.95 శాతం వరకు వేతనాల పెంపు

**అగ్ని ధార న్యూస్, ( హైదరాబాద్):**

తెలంగాణ రాష్ట్రంలో కార్మికుల కనీస వేతనాల సవరణకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు 12 ఏళ్ల తర్వాత కనీస వేతనాలను సవరించిన ప్రభుత్వం జూన్ 1 నుంచి కొత్త వేతనాలను అమల్లోకి తీసుకురానుంది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 1.11 కోట్లకు పైగా కార్మికులకు లబ్ధి చేకూరనుంది.దఈ విషయాన్ని గురువారం తెలంగాణ సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కార్మిక ఉపాధి కల్పన మరియు గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రకటించారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వేమ్ నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కనీస వేతనాల చట్టం--1948 ప్రకారం రాష్ట్రంలోని వివిధ రంగాల కార్మికులకు కనీస జీవన భద్రత కల్పించేందుకు ప్రభుత్వం వేతనాలను నిర్ణయించే అధికారం కలిగి ఉందన్నారు. తెలంగాణలో ప్రస్తుతం 73 షెడ్యూల్డ్ ఉపాధి రంగాలు ఉన్నాయని, సాధారణంగా ప్రతి ఐదేళ్లకోసారి వేతనాలను సవరించాల్సి ఉన్నప్పటికీ 2006--2012 తర్వాత సమగ్ర సవరణ జరగలేదని పేర్కొన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగానే తక్కువ వేతనాలు పొందుతున్న కార్మికుల వేతనాల పెంపు అంశాన్ని చేర్చినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ దిశగా చర్యలు ప్రారంభించామని చెప్పారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో కనీస వేతనాల సవరణ జరగలేదని విమర్శించారు. కార్మికులకు సరైన వేతనాలు అందితేనే వారి ఉత్పాదకత పెరుగుతుందని, పరిశ్రమల అభివృద్ధికి కూడా అది దోహదపడుతుందని మంత్రి పేర్కొన్నారు. కనీస వేతనాల కమిటీ నిర్వహించిన చర్చల్లో పరిశ్రమల ప్రతినిధులు కూడా పాల్గొన్నారని, పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో వేతనాల పెంపు అవసరమని వారు అంగీకరించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘంలో మల్లు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామి సభ్యులుగా పనిచేశారని వెల్లడించారు. ఈ కమిటీకి త్వరితగతిన నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు చెప్పారు. కొత్త కనీస వేతనాల అమలుతో రాష్ట్రంలోని 75 లక్షల అసంఘటిత కార్మికులు, 21 లక్షల మధ్యస్థ నైపుణ్య కార్మికులు, 15.64 లక్షల నైపుణ్య కార్మికులు లబ్ధి పొందనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. మొత్తం మీద ఈ నిర్ణయం తెలంగాణ కార్మికుల సంక్షేమానికి కీలక ముందడుగుగా నిలుస్తుందని అభిప్రాయపడింది.

# రచ్చగుట్ట మట్టి తవ్వకాలపై బీఆర్ఎస్ ఆగ్రహం

**కోర్టు స్టే ఉన్నా అక్రమ తరలింపులు జరుగుతున్నాయంటూ ఆరోపణలు**
**ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్‌పై వ్యాల్ల హరీష్‌రెడ్డి విమర్శలు**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం):**

అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామ శివారులోని రచ్చగుట్ట నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని, దీనికి రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్ సహకరిస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్‌రెడ్డి ఆరోపించారు. గురువారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి రచ్చగుట్ట ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన మీడియాతో మాట్లాడారు. రచ్చగుట్టపై ఎలాంటి తవ్వకాలు చేపట్టవద్దని కోర్టు స్టే ఉన్నప్పటికీ అధికార అండదండలతో ఇష్టారాజ్యంగా మట్టి తరలింపులు కొనసాగుతున్నాయని విమర్శించారు. గతంలో లింగాపూర్ సమీపంలోని గుట్ట నుంచి కూడా ఇదే విధంగా మట్టిని అక్రమంగా తరలించారని గుర్తు చేశారు.

ప్రస్తుతం లారీల ద్వారా పెద్దఎత్తున మట్టిని తరలిస్తూ రోడ్డు విస్తరణ పనులకు వినియోగిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే సుమారు రూ.20 కోట్ల విలువైన మట్టిని అక్రమంగా తరలించారని ఆరోపించారు. మైనింగ్ శాఖ, గ్రామపంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే తవ్వకాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సహజ వనరులను విచక్షణారహితంగా దోచుకోవడం వల్ల భవిష్యత్తులో పర్యావరణానికి తీవ్ర ముప్పు ఏర్పడుతుందని హరీష్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన ప్రజాప్రతినిధులే అక్రమాలకు పాల్పడటం దురదృష్టకరమని విమర్శించారు. ఈ అంశంపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో న్యాయపరంగా కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకువెళ్తామని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజలు అక్రమాలకు పాల్పడుతున్న వారిని తగిన విధంగా గుణపాఠం చెబుతారని హరీష్‌రెడ్డి అన్నారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా పాలన అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆముల పెద్ద శ్రీనివాస్, ఉపసర్పంచ్ కరివేద స్రవంతి--శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొలిపాక శరణ్య--మధుకర్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు పుట్ట శ్రీనివాస్ యాదవ్, మెరుగు రమేష్ గౌడ్, బండి మహేష్ గౌడ్, కోల మధుకర్ పటేల్, గోలి ప్రకాష్, గుడి రమేష్‌రెడ్డి, తరుణ్, జాహెద్ పాషా, అల్లి గణేష్, కదర్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

**అగ్నిధార న్యూస్ కమన్పూర్**

గ్రామాల్లో గంజాయి విక్రయించిన సేవించిన కఠిన చర్యలు తప్పవని కమాన్ పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్ హెచ్చరించారు. గురువారం కమాన్పూర్ మండల కేంద్రంలోని హోటల్లు పాన్ షాపులను జాగిలంతో తనిఖీ చేశారు. గంజాయి,మాదక ద్రవ్యాల నియంత్రణ మరియు ప్రజల్లో అవగాహన పెంపు లక్ష్యంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నార్కోటిక్ డాగ్ స్క్వాడ్,యాంటీ నార్కోటిక్స్ వింగ్, కమాన్ పూర్ సమన్వయంతో ఎస్సై కొట్టే ప్రసాద్ ఆధ్వర్యంలో కమాన్ పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీలు బస్టాండ్ ప్రాంతంలో మరియు పాన్ షాపులు, వివిధ కిరాణా షాపులు, కూడళ్ల వద్ద ఆయాపరిసరాలు మరియు ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో చేపట్టారు. పలువురు అనుమానిత వ్యక్తులు, ప్రయాణికుల సామాన్లు,హోటళ్ల పరిసరాలు,పాన్ షాపులు మరియు అనుమానాస్పద ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.మాదక ద్రవ్యాల అక్రమ రవాణా,వినియోగం మరియు నిల్వలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్సై కొట్టే ప్రసాద్ తెలిపారు. ప్రజలకు గంజాయి, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరమని ఎస్సై ప్రసాద్ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఏ హెడ్ కానిస్టేబుల్ లో బాబు, మధునయ్య, మల్లయ్య,సతీష్, తదితరులు ఉన్నారు.

# కందుల సంధ్యరాణికి ఘన సన్మానం

**బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షురాలి నియామకంపై హర్షం**
**పెరిక సంఘం ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమం**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షురాలిగా నియమితులైన కందుల సంధ్యరాణిని పెరిక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. లింగాపూర్ గ్రామంలోని ఆమె నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ నాయకులు, కుల బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.దఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ కందుల సంధ్యరాణి ప్రజాభిమానంతో ఎంపీటీసీగా, ఎంపీపీగా, రెండుసార్లు జెడ్పీటీసీగా విజయం సాధించి ప్రజలకు విశేష సేవలు అందించారని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు బీసీ వర్గాల అభ్యున్నతి, సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆమె చురుకైన పాత్ర పోషించారని తెలిపారు.

ఆమె సేవలను గుర్తించిన బీజేపీ రాష్ట్ర నాయకత్వం రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించడం పెరిక సంఘానికి గర్వకారణమని పేర్కొన్నారు. సంధ్యరాణి పెరిక కుల బంధువులకు ఇంటి ఆడబిడ్డలా అండగా నిలుస్తూ బీసీల ఐక్యత, సామాజిక అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అభినందించారు. భవిష్యత్తులో కూడా బీసీ వర్గాల అభ్యున్నతి, సమాజ సేవ కోసం మరింతగా పనిచేయాలని సంఘ నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడు దుండే మల్లేశం, అసోసియేట్ అధ్యక్షుడు గోవిందుల ఆనంద్, రామగుండం కార్పొరేషన్ అధ్యక్షుడు పోతరాజుల అంజయ్య, ఆర్థిక కార్యదర్శి కందుల సత్యనారాయణ, కనకరాజు, మద్ది కుమార్, ఆకుల సత్యనారాయణ, మీస వికాస్, కందుల సతీష్, బోడకుంట రవీందర్, అలిశెట్టి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# వీధి నాటకాలను ప్రోత్సహిద్దాం

**సహాయం అందజేసిన సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

గ్రామీణ ప్రాంతాల్లో మరుగున పడుతున్న వీధినాటకలను ప్రోత్సహిద్దామని సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి అన్నారు.తలకొండ పల్లి మండలం పడకల్ గ్రామంలో కళా నాట్య బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న బలి చక్రవర్తి బయల్ నాటకానికి 30 వేల రూపాయలు తన వంతుగా విరాళం అందజేసిన సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సంస్కృతి, సంప్రదాయాలు, కళాపోషణ అంతరించిపోకుండా ఉండేందుకు గ్రామీణ ప్రాంతాలలో కనుమరుగవు తున్న వీధి నాటకాలను కాపాడుకోవాలని తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో , కళా నాట్యమండలి బృందం తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబు ను కలిసిన ఆదివరాహ స్వామి దేవస్థానం చైర్మన్ దామోదర్

**అగ్నిధార న్యూస్ కమన్పూర్**

కమాన్ పూర్ : రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ను కమాన్ పూర్ ఆదివరాహ స్వామి దేవస్థానం చైర్మన్ ముస్త్యాల దామోదర్, ఆలయ ఈవో కాంత రెడ్డి లు గురువారం కాళేశ్వరంలో సరస్వతి అంత్య పుష్కరాల ప్రారంభోత్సవం కార్యక్రమంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆదివరాహ స్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబును కోరగా మంత్రి శ్రీధర్ బాబు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

# సబ్సిడీ పైన జిలుగు విత్తనాలు పంపిణీ

**అగ్నిధార న్యూస్మహమ్మదాబాద్:**

మండల కేంద్రంలో ఉన్న ఆగ్రో రైతు సేవ కేంద్రంలో ఉన్న సబ్సిడీ పైన జిలుగు విత్తనాలు పంపిణీచేశారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలి కావలసిన రైతులు పట్టా పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామ్ లాల్, డిప్యూటీ సర్పంచ్ పవన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కె యం. నారాయణ, మాజీ ఎంపీపీ శాంతి రంగ్య , మోహన్, వేణు గౌడ్ ,అనంతయ్య, వెంకట రాములు, ముకుందం, అశోక్ రెడ్డి, లక్ష్మి కాంత్ రెడ్డి, మండల ప్రజా నాయకులు మరియు ఇతర రైతులు పాల్గొన్నారు.

# వీధి నాటకాల ద్వారా చరిత్రను గుర్తుచేస్తాయి.

**నాటక పాత్ర దారులకు.వార్డ్ మెంబర్ భాగ్యలక్ష్మి ఘనసన్మానం**

**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్:**

మహమ్మదాబాద్ మండల పరిధిలోని,గాధిర్యాల్ గ్రామంలో గత ఐదు రోజులుగా కొనసాగిన ముని రంగస్వామి వీధినాటకం.నేటితో మూగీయనన్నది.ఈసందర్భంగా, ఏడు,ఎనిమిదోవ వార్డు మెంబర్లు తలారి భాగ్యలక్ష్మి,జి పాండు,కళను గుర్తించి,మునిరంగస్వామి వీధి నాటకంలో పాల్గొన్న.పాత్ర దారులకు.శాలువతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా,ఆమె మాట్లాడుతూ..వీధి నాటకాలు చరిత్రను గుర్తుచేస్తాయన్నారు. మండలంలో ఉన్న ప్రతి గ్రామంలో వివిధ రకాల వీధి నాటకాలు ఏర్పాటుచేసి.నేటి సమాజానికి చరిత్రకు గురించి.తెలపాలన్నారు. ముఖ్యంగా వీధి నాటకాలను గ్రామ ప్రజలు యువకులు ప్రోత్సహించాలని అన్నారు.శ్రీమునిరంగస్వామి నాటకంలో వివిధ పాత్రలు వేసి.తమ నాటకంతో గ్రామస్తులను ఆనందింప చేశారు.వీధి నాటకంలో పాల్గొన్న. పాత్రధారులకు.ఆమె ప్రత్యేక అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో సన్ డ్రెస్ కేశవులు,పులి అనంతయ్య,దాన్నేమోని కృష్ణయ్య,ఎన్ కృష్ణయ్య, (వీధినాటక పంతులు అక్కంపేట అనంతయ్య,కృష్ణాజి తబ్బిలిస్తూ. రుక్కయ్య ),గ్రామస్తులు వీధి నాటక సభ్యులు,పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలను పరామర్శించిన వ్యాల్ల హరీష్‌రెడ్డి

**ఎండ తీవ్రత దృష్ట్యా టవల్స్, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):**

అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామ శివారులోని రామస్వామి కుంట చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్‌రెడ్డి గురువారం పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న కూలీలను ఆత్మీయంగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి తీవ్ర ఉష్ణోగ్రతల మధ్య కూలీలు శ్రమిస్తున్న తీరును పరిశీలించిన హరీష్‌రెడ్డి, జీవనోపాధి, వేతనాలు, పనుల పరిస్థితులపై మహిళా కూలీలతో మాట్లాడారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఉపాధి హామీ పనులను మధ్యాహ్నానికి ముందుగానే పూర్తి చేసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కూలీలకు ఉపశమనం కలిగించేలా 250 మందికి టవల్స్ పంపిణీ చేశారు. అదేవిధంగా ఎండ వేడిలో దాహార్తి తీర్చేందుకు 500 మజ్జిగ ప్యాకెట్లను స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో భాగంగా కొద్దిసేపు కూలీలతో కలిసి ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆముల పెద్ద శ్రీనివాస్, ఉపసర్పంచ్ కరివేద స్రవంతి--శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొలిపాక శరణ్య--మధుకర్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పుట్ట శ్రీనివాస్ యాదవ్, మెరుగు రమేష్ గౌడ్, బండి మహేష్ గౌడ్, కోల మధుకర్, గోలి ప్రకాష్, తరుణ్, జాహెద్ పాషా, అల్లి గణేష్, కదర్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంజేపీ గురుకులాలకు బ్రాండ్ ఇమేజ్ తీసుకురావాలి

**విద్యార్థులకు సమగ్ర విద్యాబోధన అందించాలి**
**8వ తరగతి నుంచే నీట్, ఎంసెట్‌కు ప్రత్యేక శిక్షణ**
**ఫలితాలు తక్కువగా వచ్చిన ప్రిన్సిపాళ్లకు మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరిక**

**అగ్ని ధార న్యూస్,(హైదరాబాద్):**

మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యాసంస్థలు రాష్ట్రంలోనే ఆదర్శ విద్యాసంస్థలుగా నిలవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రిన్సిపాళ్లను మంత్రి అభినందించారు. ఫలితాలు ఆశించిన స్థాయిలో రాకపోయిన విద్యాసంస్థలు ఆత్మపరిశీలన చేసుకుని వచ్చే విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్, కృత్రిమ మేధస్సు వంటి అంశాల్లో కూడా ప్రోత్సాహం కల్పించాలని ఆదేశించారు. గురుకులాల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచి విద్యార్థులకు మెరుగైన భోజనం అందిస్తున్నదన్నారు. తల్లిదండ్రుల కంటే ఎక్కువ సమయం ఉపాధ్యాయుల వద్దే విద్యార్థులు గడుపుతారని, తమ సొంత పిల్లల మాదిరిగా వారిని చూసుకోవాలని సూచించారు. విద్యార్థులకు క్రమశిక్షణ, సమాజంలో ఎలా మెలగాలో, పెద్దలతో ఎలా మాట్లాడాలో నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని తెలిపారు. గురుకులాల్లో చిన్న చిన్న కారణాలతో ఆత్మహత్యలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి, విద్యార్థుల్లో మనోధైర్యం పెంపొందించేలా ప్రేరణ కల్పించాలని సూచించారు. ప్రతి గురుకులంలో తల్లిదండ్రుల--ఉపాధ్యాయుల సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. పదో తరగతిలో 98.45 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల సెక్రటరీ సైదులు, ప్రిన్సిపాళ్లను అభినందించారు. 500కు పైగా మార్కులు 9,788 మంది విద్యార్థులు సాధించారని, 204 గురుకులాలు వంద శాతం ఫలితాలు నమోదు చేశాయని తెలిపారు. 65 పాఠశాలలు వెనుకబడి ఉన్నాయని, వాటి ప్రిన్సిపాళ్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హెచ్చరించారు. ముఖ్యంగా తెలుగు సబ్జెక్టులో ఎక్కువ మంది విఫలమవుతున్నందున ఆ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 90.31 శాతం, ఒకేషనల్ ద్వితీయ సంవత్సరంలో 97.72 శాతం, ప్రథమ సంవత్సరంలో 85.80 శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. 900కు పైగా మార్కులు 4,183 మంది, 980కు పైగా మార్కులు 496 మంది సాధించడం సంతోషకరమన్నారు. ద్వితీయ సంవత్సరంలో 35 విద్యాసంస్థలు, ప్రథమ సంవత్సరంలో 8 విద్యాసంస్థలు వంద శాతం ఫలితాలు సాధించాయని తెలిపారు. ఎంజేపీ గురుకులాల్లో చదివిన పదో తరగతి విద్యార్థులకు నేరుగా ఇంటర్‌లో ప్రవేశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గురుకులంలో కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. 8వ తరగతి నుంచే నీట్, ఎంసెట్, ఇతర పోటీ పరీక్షలకు శిక్షణ అందించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలో ర్యాంకర్ల ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి గ్రామాల్లో ఫలితాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల వారు కూడా వచ్చి అధ్యయనం చేసే స్థాయికి ఎంజేపీ గురుకులాలను తీసుకెళ్లాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి, ఎంజేపీ గురుకులాల సెక్రటరీ సైదులు, ఆర్‌సీవోలు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

# కమాన్ పూర్ లో ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవ వేడుకలు..!

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్**

కమాన్ పూర్ మండల కేంద్రంలోని అంగడి బజారులో శ్రీలక్ష్మి, భూలక్ష్మి సహిత బొడ్రాయి 3వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వేద మంత్రచ్చారాణాల మధ్య సంప్రదాయ పద్దతిలో దేవత మూర్తుల విగ్రహాలకు అభిషేకం, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# వరి ధాన్యం అమ్మేందుకు వచ్చే రైతులకు మజ్జిగ నీళ్ల పంపిణీ

రైతులు మధ్య దళారులను ఆశ్రయించి మోసపోవద్దు..
సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

రైతన్నలు మధ్య దళారులను ఆశ్రయించకుండా నేరుగా ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఆమనగల్లు మార్కె ట్ యార్డ్ ఆవరణలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువచ్చి ధాన్యాన్ని అమ్ముకోవచ్చని డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా కోరారు. గురువారం మార్కెట్ యార్డు ఆవరణలో వరి ధాన్యం అమ్మేందుకు వచ్చిన రైతన్నల కోసం గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంచినీళ్ల బాటిళ్లు, మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు గంప వెంకటేష్ గుప్తా తెలిపారు. గురువారం రైతులకు నీళ్ల బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులెవ్వరు అధైర్య పడొద్దు చివరి గింజ వరకు వరి ధాన్యాన్ని కొనుగోలుకు ప్రాథమిక సహకార సిబ్బంది సిద్ధంగా ఉన్నారని గుర్తు చేశారు. రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని దీనితోపాటు సన్న రకం వడ్లకు రూ. 500 బోనస్ ప్రభుత్వం చెల్లిస్తుందని ఆయన వివరించారు. మార్కెట్ యార్డ్ ఆవరణలో రైతుల కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరిగిందని మరోసారి ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో వైస్ ఛైర్మెన్ ధోనాదుల సత్యం, ఆమనగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, దుద్దు ఆంజనేయులు, ఎనుముల రమేష్, ఎంగలి భాగ్యలక్ష్మి రఘు, నాగిళ్ల జగన్, అనూష శ్రీశైలం, రామ్ నుంతల సర్పంచ్ శ్రీను నాయక్, మాజీ ఎంపీటీసీ లచ్చిరాం నాయక్, బిఆర్ఎస్ నాయకులు సయ్యద్ ఖలీల్, సైదులు గౌడ్, పాండు, వేణు, ఏఈవోలు మీనాక్షి భూదేవి, సింగల్ విండో సీఈఓ లు పద్మాకర్ రెడ్డి దేవేందర్ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగ సందర్భంగా గోవుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

**చెక్‌పోస్టులను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డి.జానకి,**

**మహబూబ్ నగర్ :** బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో గోవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టులను జిల్లా ఎస్పీ డి.జానకి, గురువారం మిడ్జిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి వాహనాల తనిఖీలను కట్టుదిట్టంగా నిర్వహించాలని, అనుమానాస్పద వాహనాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని సూచించారు. గోవుల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, రాత్రి వేళల్లో ప్రత్యేక అప్రమత్తతతో విధులు నిర్వహించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ, బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లాలో గోవుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు అన్ని చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతర్‌జిల్లా మార్గాల్లో వాహనాల తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, చట్టవ్యతిరేక కార్యక లాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అనంతరం జిల్లా ఎస్పీ మిడ్జిల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించారు. స్టేషన్‌లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని, ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ఎస్పీ రైతులకు ప్రత్యేక విజ్ఞప్తి చేస్తూ, రహదారులపై ధాన్యాన్ని ఆరబెట్టరాదని సూచించారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టడం వలన వాహనాలు స్కిడ్ అయ్యే ప్రమాదం ఉండటంతో పాటు రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా రైతులు రహదారులను వినియోగించే ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యాన్ని రోడ్లకు దూరంగా ఉన్న సురక్షిత ప్రదేశాల్లోనే ఆరబెట్టుకోవాలని కోరారు. ఈ సందర్భంలో జడ్చర్ల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మహేష్, మిడ్జిల్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఎక్కడ చూసినా.. ధాన్యం కుప్పలే..

**నిర్మల్ :** ధాన్యాన్ని అమ్ముకొనేందుకు అన్నదాతలు అరిగోస పడుతున్నరు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు పేరుకుపోయాయి. రాష్ట్ర ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోపాటు ఆయా శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపం రైతులకు శాపంగా మారుతున్నది. 20 రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో 30 శాతానికి మించి కొనుగోళ్లు జరగలేదు. కొన్ని చోట్ల పేరుకే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా.. నేటికీ ఒక్క బస్తా కూడా కోనుగోలు చేయలేదు. దీంతో జిల్లాలో ఎక్కడ చూసినా ధాన్యం కుప్పలే కనిపిస్తున్నాయి. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఈ యాసంగిలో 1,17,085 ఎకరాల్లో వరి సాగవగా.. 1.83 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అందుకు అనుగుణంగా ఇప్పటి వరకు 295 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా.. ఇప్పటివరకు 205 కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నారు. మిగతా సెంటర్లను ప్రారంభించినప్పటికీ హమాలీల కొరత కారణంగా కొనుగోళ్లు జరపడం లేదు. ధాన్యం సేకరణ లక్ష్యం 1.83 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, ఇప్పటివరకు 47,136 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఇంకా.. 1,35,864 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. జిల్లా వ్యాప్తంగా కోనుగోళ్లను ప్రారంభించి దాదాపు 20 రోజులు అవుతున్నా.. ఇప్పటి వరకు కేవలం 30 శాతం ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రూ.112 కోట్లను రైతులకు చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు రూ.42 కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేశారు. అంటే ఇంకా రూ.70 కోట్ల వరకు రైతులకు చెల్లించాలి.



**పేరుకుపోయిన వడ్ల కుప్పలు**

ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో ఎటు చూసినా వడ్ల కుప్పలే దర్శనమిస్తున్నాయి. కొనుగోలు సెంటర్ల వద్ద రైతులు వడ్లను తీసుకొచ్చి కుప్పలుగా పోశారు. ఒకవైపు ఉరుములు మెరుపులతో వాతావరణం ఒక్కసారిగా మారిపోతుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. దీంతో రైతులు వడ్ల కుప్పలపై టార్పాలిన్లను కప్పి పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. పక్షం రోజులుగా ఇక్కడి సెంటర్‌కు వడ్లను తీసుకొచ్చామని, ఇప్పటి వరకు ఒక్క బస్తా కూడా కొనుగోలు చేయలేదని నిర్మల్ మండలం ముజ్గి గ్రామానికి చెందిన రైతులు వాపోతున్నారు. ఎప్పుడు కొంటారోనని ఎదురుచూస్తూ రోజుల తరబడి వడ్ల కుప్పల వద్దనే పడిగాపులు కాస్తున్నారు. అకాల వర్షాల ముప్పుతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. హమాలీల కొరత కారణంగా కొనుగోళ్లు చేపట్టలేకపోతున్నామని నిర్వాహకులు పేర్కొంటున్నారు. కనీసం గన్నీ బ్యాగులైనా ఇస్తే తామే వడ్లను నింపుకుంటామని రైతులు మొర పెట్టుకున్నా.. కొన్నిచోట్ల కేంద్రాల నిర్వాహకులు బ్యాగులు ఇవ్వడం లేదు. మరోవైపు వడ్లను తరలించేందుకు లారీల కొరత ఉన్న కారణంగా కావాలనే కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇబ్బడి ముబ్బడిగా వస్తున్న ధాన్యాన్ని మిల్లర్లు తీసుకొనేందుకు వెనకడుగు వేస్తున్నట్లు సమాచారం. ఇలా అనేక రకాల కొర్రీలతో కొనుగోలు ప్రక్రియ మందకోడిగా సాగుతున్నది. గత కేసీఆర్ హయాంలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ రాలేదని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచే కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని రైతులు మండిపడుతున్నారు.

**నిర్మల్ జిల్లాలో..**

ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం : 1.83 లక్షల మెట్రిక్ టన్నులు
కొనుగోలు చేసింది : 47,136 మెట్రిక్ టన్నులు
కొనాల్సింది : 1,35,864 మెట్రిక్ టన్నులు

## వైభవంగా సరస్వతి అంత్య పుష్కరాలు ప్రారంభం

**భూపాలపల్లి :** సరస్వతి అంత్య పుష్కరాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పుష్కరాల తొలి రోజు గురువారం ఉదయం 5.43 గంటలకు పవిత్ర సంగంలో తొలి పుష్కర స్నానం నిర్వహించారు. ఈ పుణ్యస్నానాన్ని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వాములు, ఐటి పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దంపతులు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండల పరిధిలోని నిర్మలనగర్ గ్రామానికి చెందిన కర్రె మల్లేశం 48, తండ్రి పోచయ్య, వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కుటుంబ అవసరాలు, కుమార్తె వివాహానికి చేసిన అప్పులు, ఇతర ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వ్యవసాయం ద్వారా వచ్చిన ఆదాయం సరిపోకపోవడం, భూమిని అమ్మేందుకు ప్రయత్నించినప్పటికీ కొనుగోలుదారులు దొరకకపోవడంతో మానసిక ఆందోళనకు లోనయ్యాడని పేర్కొన్నారు.ఈ క్రమంలో ఈ నెల 10వ తేదీ ఉదయం వరి కోత మిషన్ వద్దకు వెళ్లిన మల్లేశం, మద్యం సేవించిన అనంతరం పురుగుల మందు తాగినట్లు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆర్.వి.యం హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం 11:25 గంటలకు మల్లేశం మృతి చెందినాడు.మృతుడికి భార్య మంజుల, కుమారుడు సన్నిత్ కుమార్, కుమార్తెలు అంకిత అక్షయ ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సుభాష్ తెలిపారు.

## రైతులను దోచుకుంటే ఊరుకోం

కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు వెంటనే పరిష్కరించాలి
తహసీల్దార్‌కు బీజేపీ నాయకుల వినతిపత్రం

అగ్ని ధార న్యూస్,(రామగుండం):

మండలంలోని ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు బోడకుంట సుభాష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, మిల్లర్లు కుమ్మక్కై రైతులను 'బి-కేటగిరి' పేరుతో ఇబ్బందులకు గురిచేస్తూ అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ధాన్యానికి తేమ శాతం పేరుతో అనవసర కోతలు విధించడం, 'తాలు', 'తరుగు' పేరుతో దోపిడీ చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు లేకపోవడంతో వర్షాలు కురిస్తే ధాన్యం తడిసి రైతులు మరింత నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు అన్ని కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాలసాని సత్యం గౌడ్, తమ్మినవేని మల్లేష్, మాడ ప్రభాకర్‌రెడ్డి, మీడివెల్లి అంజి, దుంపేటి రాజు, అయిత నవీన్, గోలివాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు

చిత్రపటానికి నివాళులర్పించిన స్థానిక సర్పంచ్ కాంగ్రెస్ నాయకులు

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

వెల్దండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరి కిషన్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, డిసిసి ఉపాధ్యక్షుడు భూపతి రెడ్డి , ప్రధాన కార్యదర్శి మోతిలాల్ నాయక్ పార్టీ నాయకులు పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. యువత అభివృద్ధి, సాంకేతిక రంగంలో దేశాన్ని ముందుకు నడిపించిన నాయకుడిగా రాజీవ్ గాంధీని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తాలూకా కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు పర్వత్ రెడ్డి, సర్పంచ్ బద్రి తారా సింగ్, మండల ఉప సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు ఎర్ర శీను ముదిరాజ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మట్ట భరత్ గౌడ్, యువజన కాంగ్రెస్ వెల్దండ గ్రామ కమిటీ అధ్యక్షులు జంగిలి ఆనంద్ రాజ్, జిల్లా ఎస్సీ సెల్ సేవాదళ్ అధ్యక్షుడు కొయ్యల పుల్లయ్య, క్యాచారం వెంకటయ్య, మట్ట నాగేశ్వరరావు, గుద్దటి క్రిస్టల్, రఘుపతి నాయక్, ఎండి రషీద్, కొండల్, శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ద

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల్ వెంకటేష్

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

మాడ్గుల మండలం కలకొండ బురేలా లక్ష్మమ్మ భర్త మల్లయ్య అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. ఈ విషయాన్ని స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతురాలి కుటుంబానికి తక్షణ ఆర్థిక కసహాయం 3000 రూపాయలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కలకొండ బీఆర్ స్ పార్టీ మాజీ ప్రధానకార్యదర్శి ఎల్లికంటిసైదులు,వార్డ్ సభ్యులు సామలఈదయ్య, పల్లెనరేష్, బంగారుమల్లేష్,చింతపల్లికృష్ణయ్య, టిఆర్ఎస్ యాదయ్య , గుండాలరాజు, గ్రామ ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల చారి ట్రబుల్ ట్రస్ట్ ద్వారా నిరుపేద కుటుంబ ఇంటి నిర్మాణానికి చేయూత

బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

అమనగల్ మున్సిపల్ లోని పద్మ తండ్రి బాలయ్య నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో వారు నిర్మించుకున్న ఇంటి నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడం తో స్థానిక బీ ఆర్ ఎస్ పార్టీ నాయకుల ద్వారా రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మ న్ ఉప్పల వెంకటేష్ నీ సంప్రదించగా వెంటనే స్పందించి ఇండ్ల సిమెంట్ ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, మున్సిపల్ కౌన్సిలర్ శ్రీశైలం ఉప సర్పంచ్, నూకం కోటీశ్వర్, దశరథ, గోపి,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి జన్మ దిన వేడుకలను

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ పుట్టిన రోజు వేడుకలను కల్వకుర్తి నియోజక వర్గం లోని అన్ని మండలలో బీఆర్ఎస్ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు కల్వకుర్తి పట్టణంలోని పాలమూరు చౌరస్తాలోన్ క్యాంపు కార్యాలయ ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం ఫుడ్ కమిషన్ చైర్మన్ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్ రెడ్డి నీ శాలువాతో సన్మానించి వారి సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం బాణా సంచాలు కలుస్తూ కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు ఆయనను మర్యాద పూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్చాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో,మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీశైలం, ఎద్మ సత్యం,మాజీ జెడ్పీటీసి దశరథ్ నాయక్,మాజీ సర్పంచ్ లక్ష్మి నరసింహ రెడ్డి కార్మిక నాయకులు సూర్యప్రకాష్ రావు,సర్పంచ్ కృష్ణ రెడ్డి మరియు గ్రామాల సర్పంచ్లు ఉప సర్పంచ్ లు వార్డ్ సభ్యులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలి

మహిళలకు శిక్షణ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయి


అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)


మహిళలు తమకు నచ్చిన రంగాలలో రాణిస్తూ.. స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా, డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. కడ్తాల పట్టణంలోని కమ్యూనిటీ హాల్ లో మహిళలకు బ్యూటీ పార్లర్ పై 90 రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నిర్వాహకులు ట్రైనర్ అఫ్రిన్ బేగం ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. దీనికిగాను బ్యూటీ పార్లర్ కు సంబంధించిన క్రీములు, పరికరాల కోసం రూ, 10,000 వేలను గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఇలాంటి శిక్షణలు మహిళలకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న మహిళలతో పాటు ట్రైనర్ ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ, గాన్గుమర్ల తండా బిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాండు నాయక్, సురేష్, మహిళలు రజిత, సౌజన్య, లక్ష్మి, ఎం లహరి, సుల్తానా, సింధు, దివ్య, పావని, భార్గవి, శశి, దేరంగుల సత్యం, బోసు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రియల్ పహిల్వాన్స్.. వాళ్లను బతిమాలాల్సి వచ్చింది



మెగా ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోన్న చిత్రం పెద్ది. ఈ మూవీ రామ్ చరణ్ డిఫరెంట్ పాత్రల్లో అభిమానులను మెప్పించనున్నారు. ఉ?ప్పెన ఫేమ్ బుచ్చిబాబు డైరెక్షన్‌లో వస్తోన్న ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ట్రైలర్ రిలీజ్ కాగా.. ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఏ క్రీడ ఆడాలన్నా పెద్దినే అనే స్పోర్ట్స్ కాన్సెప్ట్ ట్రైలర్ చూస్తేనే అర్థమవుతోంది. ఈ మూవీని స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం పెద్ది మూవీ ప్రమోషన్లతో బిజీగా ఉన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ బుచ్చిబాబుతో రామ్ చరణ్ తన అనుభవాలను పంచుకున్నారు. ముఖ్యంగా రెజ్లర్లతో సీన్ల గురించి వివరించారు. ఇసుకలో, ఎండలో షూటింగ్ చాలా కష్టంగా అనిపించలేదా అని బుచ్చిబాబ.. చెర్రీని ప్రశ్నించారు. దీనికి రామ్ చరణ్ బదులిస్తూ నేనైతే చాలా బాగా ఎంజాయ్ చేశానని అన్నారు. కష్టమైన పనిని ఇష్టంగా చేస్తే ఎలాంటి అలసట రాదన్నారు. అయితే కుస్తీలో చేయి పట్టి అదురు రావడంతో మా పాపను కూడా ఎత్తుకోలేకపోయానని తెలిపారు. మీరు నిజమైన పహిల్వాన్లను పెట్టారని రామ్ చరణ్ అన్నారు. వాళ్లు నటించమంటే.. రియల్‌గా ఆడేస్తున్నారని రామ్ చరణ్ గుర్తు చేశారు. తర్వాత మళ్లీ సారీ చెబుతున్నారని తెలిపారు. ఎందుకంటే వాళ్లలో నిజమైన స్పోర్ట్స్ మ్యాన్ స్పిరిట్ అనేది వాళ్లలో ఉంటుందని చెర్రీ వివరించారు. యాక్టింగ్ చేయమంటే వారికి అది రాదని అన్నారు. కాగా.. ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ మూవీలో శృతిహాసన్ స్పెషల్ సాంగ్‌లో మెప్పించనుంది.






# 'డ్రాగన్' మూవీ క్రేజీ అప్‌డేట్.. ఎన్టీఆర్ తమ్ముడిగా బాలీవుడ్ నటుడు సిద్ధాంత్ గుప్తా!

జూనియర్ ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ ఎపిక్ 'డ్రాగన్' సినిమాకు సంబంధించి ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ సినిమాలో ఒక కీలకమైన పాత్ర కోసం మొదట మలయాళ స్టార్ హీరో టోవినో థామస్‌ను అనుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాకు చాలా ఎక్కువ రోజులు కాల్‌షీట్స్ కేటాయించాల్సి రావడం, దానివల్ల తన మిగతా మలయాళ ప్రాజెక్టులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో టోవినో ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోగా.. అతడి పోషించే పాత్రలో బాలీవుడ్ నటుడు సిద్ధాంత్ గుప్తా నటించినట్లు తెలుస్తుంది. 'జుబిలీ', 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్' వంటి వెబ్ సిరీస్‌లతో మెప్పించిన సిద్ధాంత్ గుప్తా ఈ చిత్రంతోనే టాలీవుడ్‌లోకి గ్రాండ్‌గా ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ఈ చిత్రంలో సిద్ధాంత్ గుప్తా 'బాబీ సర్కార్' అనే పాత్రలో కనిపించబోతుండగా.. ఆఫ్ఘన్ ట్రేడింగ్ కంపెనీకి 'వజీర్' (ముఖ్య సూత్రధారి)గా వ్యవహరించే ఈ క్యారెక్టర్, సినిమాలో ఎన్టీఆర్ పోషిస్తున్న 'లూగర్' అనే పాత్రకు సోదరుడిగా ఉంటుందని సమాచారం. మైత్రీ మూవీ మేకర్స్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఎన్టీఆర్ అత్యంత క్రూరమైన స్మగ్లింగ్ సిండికేట్ అసోసియేట్ పాత్రలో కనిపించబోతున్నారు. అనిల్ కపూర్ రఘువీర్ రాథోడ్‌గా నటిస్తుండగా, రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. బిజు మీనన్, ఖుష్బూ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తున్నారు. భారీ అంచనాలున్న ఈ యాక్షన్ విజువల్ వండర్ జూన్ 11, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.



# క్రైమ్ థ్రిల్లర్‌గా బాబీ డియోల్ 'బందర్'.. ట్రైలర్ విడుదల!

బాలీవుడ్ స్టార్ నటుడు బాబీ డియోల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ బందర్ 'యానిమల్' సినిమాతో గ్లోబల్ స్థాయిలో తన పవర్‌ఫుల్ నటనతో ఆకట్టుకున్న బాబీ డియోల్, మరోసారి అంతకు మించిన ఇంటెన్స్ రోల్‌లో ఈ చిత్రం ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ట్రైలర్ చూస్తుంటే.. బాబీ డియోల్ ఈ సినిమాలో ఓ రాక్ స్టార్‌గా, విలాసవంతమైన జీవితాన్ని గడిపే 'ప్లేబాయ్' పాత్రలో కనిపిస్తున్నాడని తెలుస్తుంది. అయితే, అంతా సాఫీగా సాగిపోతున్న సమయంలో అతను అనుకోకుండా జైలు పాలు కావాల్సి వస్తుంది. అసలు బాబీ జైలుకు ఎందుకు వెళ్ళాడు? అతనిపై కేసు పెట్టిన ఆ యువతి ఎవరు? అనే ఆసక్తికర అంశాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఇక ఈ చిత్రంలో బాబీ డియోల్‌తో పాటు సన్యా మల్హోత్రా, సబా ఆజాద్ మరియు సప్నా పబ్బి కీలక పాత్రల్లో మెరుస్తున్నారు. ఈ సినిమాకు అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహిస్తుండగా.. నిఖిల్ ద్వివేది మరియు అనురాగ్ కశ్యప్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అన్ని హంగులతో, హై వోల్టేజ్ డ్రామాతో రూపొందుతున్న ఈ చిత్రం 2026, జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. బాబీ డియోల్ కొత్త మేకోవర్ చూస్తుంటే ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచడం ఖాయంగా కనిపిస్తోంది.



# ఇష్టం లేకున్నా ఆ సినిమాలో నటించా.. హీరో వేణు

1999లో స్వయం వరం అనే సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాడు తొట్టెంపూడి వేణు. మొదటి సినిమతోనే మంచి సాలిడ్ హిట్ అందుకున్నాడు. హీరో గానూ ఫుల్ మార్కులు కొట్టేశాడు. ఆ తర్వాత కూడా మనసుపడ్డాను కానీ, చిరునవ్వుతో, వీడెక్కడి మొగుడండి?, హనుమాన్ జంక్షన్, కళ్యాణ రాముడు, పెళ్ళాం ఊరెళితే, ఖుషీ ఖుషీగా, చెప్పవే చిరుగాలి, సదా మీ సేవలో, అల్లరే అల్లరి, బహుమతి, గోపి గోపిక గోదావరి ఇలా పలు హిట్ సినిమాల్లో నటించాడు వేణు. రాజేంద్రప్రసాద్ తరహాలోనే కామెడీ హీరోగా తెలుగు ఆడియెన్స్ కు బాగా చేరువయ్యాడు. ఓ వైపు హీరోగా సినిమాలు చేస్తూనే వెంకటేష్ చింతకాలయ రవి, ఎన్టీఆర్ దమ్ము లాంటి సినిమాల్లో సహాయక నటుడిగానూ మెప్పించాడు వేణు. అయితే 2013 తర్వాత ఇండస్ట్రీకి పూర్తిగా దూరమైపోయాడు వేణు. చేసిన సినిమాలన్నీ ఫెయిల్ అవ్వడంతో కొద్దిగా గ్యాప్ తీసుకున్నాడు. అయితే 2022లో రామారావు ఆన్ డ్యూటీ సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చాడీ ట్యాలెంటెడ్ హీరో. మాస్ మహారాజా రవితేజ హీరోగా నటించిన ఈ సినిమాలో ఆయన సీఐ మురళి అనే పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించాడు. సినిమాలో వేణుకు స్క్రీన్ స్పేస్ బాగానే దక్కినప్పటికీ రిజల్ట్ మాత్రం దెబ్బేసింది. రామారావు ఆన్ డ్యూటీ సినిమా బాక్సాఫీస్ వద్ద ఘోర పరాజయాన్ని చవిచూసింది. దీంతో తన రీఎంట్రీ ఘనంగా ప్రారంభించాలనుకున్న వేణు బాగా నిరాశ చెందాడు. అయితే రామారావు ఆన్ డ్యూటీ సినిమాపై ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేశాడు వేణు తొట్టెంపూడి. ఆ చిత్ర దర్శకుడు, నిర్మాత తనను ఇబ్బంది పెట్టడం వల్లే తనకు ఇష్టం లేకపోయినా, మొహమాటానికి పోయి ఆ పాత్ర చేయాల్సి వచ్చిందని షాకింగ్ విషయం బయట పెట్టాడు' నిజానికి నేను చాలా కాలం తర్వాత వెండితెరపైకి వస్తున్నప్పుడు చాలా బెటర్ క్యారెక్టర్‌తో రావాలని ప్లాన్ చేసుకున్నాను. కానీ రామారావు ఆన్ డ్యూటీ సినిమా దర్శకుడు, నిర్మాత నన్ను తీవ్రంగా పెట్టారు. నాకు ఆ పాత్ర చేయడం అస్సలు ఇష్టం లేదు. అయినా కేవలం మొహమాటానికి పోయి ఓకే అనాల్సి వచ్చింది. ఒక్కోసారి ఇండస్ట్రీలో ఇలాంటి మొహమాటాల వల్ల సినిమాలు చేయాల్సి వస్తుంది. మూవీ సక్సెస్ అయితే ఓకే. ఫలితం తేడా కొడితే కెరీర్ మళ్లీ వెనక్కి అడుగు వేస్తుంది' అని వేణు చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి.



# 'పదేళ్లలో 55 ట్రాన్స్‌ఫర్స్'.. ఆసక్తిగా టీజర్

టాలీవుడ్ హీరో వడ్డే నవీన్ రీ ఎంట్రీ ఇస్తోన్న లేటేస్ట్ మూవీ ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు. అప్పట్లో పెళ్లి, మనసిచ్చి చూడు లాంటి సూపర్ హిట్స్ అందుకున్న వడ్డే నవీన్ కొన్నేళ్ల తర్వాత కనుమరుగైపోయాడు. మళ్లీ గ్రాండ్‌గా రీ ఎంట్రీ ఇస్తున్నాడు. దాదాపు పదేళ్ల విరామం హీరోగా మళ్లీ ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సినిమాకు కమల్‌తేజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో రాశీసింగ్ హీరోయిన్‌గా కనిపించనుంది. తాజాగా రిలీజైన టీజర్ చూస్తుంటే ఓ కానిస్టేబుల్ స్టోరీగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరి మాట వినని రెబల్ కానిస్టేబుల్‌గా పాత్రలో వడ్డే నవీన్ కనిపించనున్నట్లు టీజర్ చూస్తుంటే అర్థమవుతోంది. ఈ మూవీ జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com